# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com


## నవంబర్ 30 హాలీడే కాదు.. ఓటింగ్ డే..


**–అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి**

**–ఓటర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ విజ్ఞప్తి**

హైదరాబాద్, నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): తెలంగాణ ఎన్నికల పోలింగ్ రోజున ప్రభుత్వం సెలవు ప్రకటించిందని.. అలాగని ప్రతి ఒక్కరు ఆ రోజును హాలిడే (సెలవు రోజు)గా కాకుండా ఓటింగ్ డే (ఓటు వేసే దినం)గా గుర్తించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కోరారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తిచేశారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదవుతున్నదని, ఈసారి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఓటు వేయడం ప్రతి ఒక్కరి విధి, బాధ్యత అని పేర్కొన్నారు. ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో ఓటర్లు ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అన్ని రకాల ఏర్పాట్లు చేసిందని తెలిపారు. బీఆర్‌కేఆర్ భవన్‌లో గురువారం ఆయన ఇతర అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఓటర్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 35,655 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, పోలీసులు సహా దాదాపు మూడు లక్షల మంది ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు.


హైదరాబాద్ శనివారం 25-11-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:90 పేజీలు:6 వెల: రూ.1/-


## నాగజ్యోతి ఎమ్మెల్యే అయితే ములుగు ఓ జ్యోతిలా వెలుగుతుంది : సీఎం కేసీఆర్



ములుగు , నవంబర్ 24: బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి ఎమ్మెల్యే అయితే ములుగు ఓ జ్యోతిలా వెలుగుతుందని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. ములుగు నియోజకవర్గంలో శుక్రవారం జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇక్కడ కొన్ని పనులు కావాల్సి ఉన్నది. ఎమ్మెల్యేగా నువ్వు ఏ పార్టీలోనైనా ఉండొచ్చు గాక. తప్పకుండా ముఖ్యమంత్రిని కలవాలి. గవర్నమెంట్‌లో ఉన్నవాళ్లను కలవాలి, మాట్లాడాలి. మీ ఎమ్మెల్యే ఎన్నడూ రాదు. ఏం అడగదు. మాకు తోచినవి.. తెలిసినవి.. మా పార్టీవాళ్లు చెప్పిన పనులు చేసుడే తప్ప ఆమె వచ్చి ఎన్నడూ అడుగదు. ఏం చేసిన్రు మీరు అంటే.. ఏం చేయలేదు ? మీ కాంగ్రెస్ పాలనలో మంచినీరు ఇచ్చారా? కాంగ్రెస్ పాలనలో కరెంటు ఇచ్చారా? రైతుబంధు ఇచ్చారా? మరి ఇవాళ ఇవన్నీ మేం ఇచ్చాం కదా? మీ కాంగ్రెస్ కాలంలో పోడు భూములు పంచారా? ఇవాళ మేం పంచినం కదా? మరి ఏం చేశారంటే..? నేను చెప్పేదంటే ఈ వాదులాటలు కాదు. జరగాల్సింది ప్రజల క్షేమం' అన్నారు.

### ఇందిరమ్మ రాజ్యంలో కాల్చి చంపుడే కదా..?

'ఇది ముఖ్యంగా గిరిజన ప్రాంతం. ముఖ్యంగా సమస్యలు ఎక్కువగా ఉంటయ్. రోడ్లు, ఇరిగేషన్ అన్నీ చేసిపెడుతానని వాగ్దానం చేస్తున్నా. బడే నాగజ్యోతి చరిత్ర మీకు తెలుసు. కాంగ్రెస్ రాజ్యం వస్తే ఇందిరమ్మ రాజ్యం తెస్తరట. ఇందిరమ్మ రాజ్యంలో ఏం మంచి గుండె. ఎన్‌కౌంటర్లు, కాల్చి చంపుడు.. ఎమర్జెన్సీపెట్టి జైళ్లలో వేసుడే ఉండెకదా? ఓ బానిస బతుకుల్లా ఉండే. అటువంటి దుర్మార్గమైన ఇందిరమ్మ రాజ్యం ఉన్నప్పుడే బడే నాగజ్యోతి తండ్రి ఉద్యమాల్లో పోయి అమరుడైండు. ప్రజల కోసం ప్రాణాలు ఇచ్చిండు. ఆయన స్వార్థం కోసం కాలేదు. ప్రజల పక్షాన కొట్లాడేందుకు వెళ్లి బలయ్యారు. అలాంటి వ్యక్తి బిడ్డ నాగజ్యోతి. తల్లిలేదు తండ్రి లేదు.. ములుగు ప్రజలు నా తల్లిదండ్రులని చెప్పింది. నేను మీ అందరినీ కోరుతున్నా. ఆమె కష్టపడి చదువుకున్నది. ఉన్నత విద్యావంతురాలుగా ఎదిగింది. సర్పంచ్‌గా పని చేసి ఇవాళ జిల్లా పరిషత్ చైర్మన్ హోదాకు వచ్చింది' అన్నారు.

### నాగజ్యోతిని గెలిపించకుంటే పంచాయితీ పెట్టుకుంట..

'నేను మీ అందరినీ కోరేది.. నాగజ్యోతి ఎమ్మెల్యే అయితే ములుగు ఓ జ్యోతిలా గ్యారంటీగా వెలుగుతుంది. నాగజ్యోతిని గెలిపిస్తే నేను ఇక్కడే రెండురోజులు క్యాంప్‌లో ఉంటాను. నేను స్వయంగా మీతోని మాట్లాడుతాను. ఎక్కడ ఏం అవసరాలున్నయో వందశాతం చేసే బాధ్యత నాది అని మనవి చేస్తున్నా. కాంగ్రెస్ పార్టీ వాళ్లు గెలిచేది లేదు సచ్చేది లేదు. ఇవాళ నేను తిరిగేది 80వ నియోజకవర్గం కావొచ్చు. ఇంకో 20 తిరిగితే అయిపోతది.

ఏం గాలి లేదు.. తుస్సుమన్నది. ఎక్కడా ఏం లేదు. అది వచ్చేది లేదు. నచ్చేది లేదు. లాస్ట్ టైమ్ గెలిపించకుంటే నేను మీ మీద అలుగలేదు. కానీ, ఇప్పుడు మాత్రం పంచాయితీ పెట్టుకుంటా. ములుగు అభివృద్ధి కావాలంటే గవర్నమెంట్ ఉండే పార్టీ గెలిస్తేనే మంచి లాభం జరుగుతుంది.

పనులు ఎక్కువ జరుగతయ్. ఆ అమ్మాయి ఇక్కడే పుట్టింది.. ఇక్కడే పెరిగింది. కుటుంబ త్యాగాలు మీకు తెలుసు. అందరూ బడే నాగజ్యోతిని దీవించండి. మీకు కావాల్సిన పనులన్నీ చేసినపెడుతాను' అని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు.

## పార్టీలకతీతంగా అభివృద్ధి చేశా..మరోసారి ఆశీర్వదించండి : మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, నవంబర్ 24 : బాల్కొండ నియోజకవర్గంలో పార్టీలకతీతంగా అభివృద్ధి చేశానని, తనను మరోసారి పార్టీలకతీతంగా ఆశీర్వదించాలని బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలోని అమీనాపూర్, లక్కోర గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారం లో మాట్లాడారు. కాళేశ్వరం నీటిని పోచంపాడ్‌లో నింపడంతో గుత్ప నవాబు ఎత్తిపోతలకు నీటి కొరత లేకుండా చేశానన్నారు.

కుల సంఘ భవనాలకు సీఎం ప్రత్యేక నిధులు తెచ్చినట్లు చెప్పారు. ఈ ప్రొసీడింగ్‌లు వట్టి కాగితాలని, కొందరు దిగజారి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అవి వట్టి కాగితాలు కాదని, గట్టి కాగితాలని పేర్కొన్నారు. కుల సంఘ భవనాలు, గృహలక్ష్మి ఇండ్ల నిర్మాణాలు మొదలు పెట్టుకోవచ్చని సూచించారు. బిల్లులు తప్పకుండా వస్తాయని అందుకు తనదే జిమ్మేదార్ అని స్పష్టం చేశారు.

ప్రజలను తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే కేసీఆర్ మంచి పోజిషన్‌లో ఉంచుతారని తెలిపారు. తాను మంచి పోజిషన్‌లో ఉంటే మళ్లీ ఎంతో అభివృద్ధిని అందించగలుగుతానన్నారు. కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు సగానికి పైగా పైరవీకారుల పాలైనవేనని గుర్తు చేశారు. కేసీఆర్ మళ్లీ గెలిస్తే సంక్షేమ పథకాలు నిరంతరంగా కొనసాగుతాయన్నారు.

## 'ప్రగతి ప్రస్థానం' పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 24:ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాల సమాహారంగా రూపొందించిన 'ప్రగతి ప్రస్థానం? ఎట్లుండే తెలంగాణ ఎట్లైంది' పుస్తకాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ శుక్రవారం ఆవిష్కరించారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అమలుచేసిన పథకాలు, కార్యక్రమాలు, విధానాల ఫలితాలు తెలంగాణలోని గడప గడపకూ చేరాయని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు యావత్ దేశానికి మార్గదర్శనంగా నిలిచి, సంక్షేమంలో స్వర్ణయుగాన్ని సృష్టించాయని అన్నారు. ఫలితంగానే తెలంగాణలో పేదరికం గణనీయంగా తగ్గినట్టు సాక్షాత్తు నీతి ఆయోగ్ నివేదిక స్పష్టం చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వ అద్భుత పనితీరును ఇలాంటి నివేదికలెన్నో తేల్చిచెప్పాయని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ ప్రభుత్వం 2014, 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయదుంధుబి మోగించిం దని, 2023లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధించి, హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపడతారని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం పునరంకితమవుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం అమలుచేసిన పథకాలు ప్రజలకు చేరువైన తీరును గణాంకాలతో సహా తన సంపాదకత్వంలో 'ప్రగతి ప్రస్థానం' పుస్తకంగా వెలువరించిన సీనియర్ జర్నలిస్టు, సీఎం పీఆర్వో రమేష్ హజారీ కృషిని మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ నాడు ఎట్లుండే.. నేడు ఎంతగా అభివృద్ధి చెందింది అనే విషయాలను తెలుసుకోగోరే ప్రతీ ఒక్కరికీ ఈ పుస్తకం ఒక హ్యాండ్ నోట్?గా ఉపయోగపడుతుందని కేటీఆర్ అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యాచరణను సంప్రదాయ పద్ధతిలోనే కాకుండా, తన సాహిత్య ప్రతిభతో సోషల్ మీడియాలోనూ, పాటలు, సాహిత్యం, పుస్తకాల రూపంలోనూ సృజనాత్మక విధానాల్లో ప్రభుత్వ కార్యాచరణను జనంలోకి తీసుకుపోయేలా సీనియర్ జర్నలిస్ట్ రమేష్ హజారీ పాటుపడుతున్న తీరును కేటీఆర్ ప్రశంసించారు.

## మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేసింది కేసీఆర్ ప్రభుత్వం

**– డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్**



సికింద్రాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); సికింద్రాబాద్ బీ ఆర్ ఎస్ అభ్యర్థి, డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ శుక్రవారం సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని వివిధ మజీదుల సమీపంలో ముస్లిం మైనారిటీ నేతలను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. చిలకలగుడా బడీ మస్జిద్, చోటి మస్జిద్, ఏక్ మినార్ మస్జిద్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అదే విధంగా స్థానిక కార్పొరేటర్లు, నేతల అధ్వర్యంలో సైతం ఈ కార్యక్రమాలు జరిగాయి. గత పదేళ్లుగా సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో మైనారిటీల సంక్షేమానికి నిరంతరం పాటు పడ్డామని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా తెలిపారు. మోజం, ఇమాం ల గౌరవ వేతనం పెంచడంతో పాటు మైనారిటీ ల విద్యావకాశాల మెరుగుదలకు ప్రత్యేక సంస్థలు స్థాపించామని తెలిపారు. సికింద్రాబాద్ లో ఈద్గా లను అభివృధి చేశామని వివిధ సదుపాయాలను కల్పించామని తెలిపారు. మైనారిటీ లకు నిత్యం తాము అండగా నిలుస్తున్నామని పద్మారావు గౌడ్ స్పష్టం చేశారు. వివిధ మైనారిటీ సంఘాల నేతలు పద్మారావు గౌడ్ ను కలిసి తమ మద్దతును ప్రకటించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత రమేష్, నేతలు కిషోర్ కుమార్, కిరణ్ కుమార్, రామేశ్వర్ గౌడ్, కరాటే రాజు, కంది నారాయణ తో పాటు పలువురు మైనారిటీ నాయకులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## కాంగ్రెస్ గెలిస్తేనే తెలంగాణలో అభివృద్ధి -ప్రియాంకా గాంధీ..



**–కాంగ్రెస్ గెలిస్తేనే పురోభివృద్ధి**
**–యువత పోరాట త్యాగం వృథా**
**–పదేళ్లల్లో నిరుద్యోగం పెరిగింది**
**–ఉద్యోగాలు లేవు, ఉపాధి లేదు**
**–అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం**
**–రైతులకు రుణ మాఫీ చేస్తాం**
**–ఇక్కడ భూ మాఫియాను అడ్డుకుంటాం**
**–రైతుల భూముల్ని కొల్లగొడుతున్న శక్తులను తిప్పి కొడతాం**
**–మండలానికి ఒక అంతర్జాతీయ స్కూలు పెడతాం**
**–కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ**

హైదరాబాద్, నవంబర్ 24:తెలంగాణాలో యువత కష్టాల్ని, త్యాగాల్ని బీఆర్ఎస్ ప్రభుత్వం వృథా చేసిందని, నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని, రైతుల కష్టాలు కడతేరలేదని, మహిళలకు రక్షణ లేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుర్తి నియెజకవర్గంలోని తొర్రూరులో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన సభలో ప్రియాంక గాంధీ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వంపై వాగ్బాణాలు సంధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గడచిన పదేళ్లల్లో తెలంగాణ యువ శక్తి నిర్వీర్యమైపోతోందన్నారు. ఉపాధి లేదు. ఉద్యోగాలు లేవు. పరీక్షలకు సిద్ధపడి, కష్టపడి చదివితే ప్రశ్నాపత్రాల లీకేజీలు నిరుద్యోగుల భవిష్యత్తును దెబ్బతీశాయని, ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఓ యువతి ఆత్మహత్య చేసుకుంటే .. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అవమానించిందన్నారు.

కాంగ్రెస్ పాలనలోని రాష్ట్రాల్లో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని, రాజస్థాన్లో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశామని, కర్ణాటక లోనూ ఉద్యోగాల భర్తీకి కృషి జరుగుతోందన్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, జాబ్ కేలండర్ విడుదల చేస్తామని, ఎన్ని ఉద్యోగలను భర్తీ చేస్తున్నాం, దరఖాస్తుల ఆఖరి తేదీ, పరీక్ష తేదీ, ఫలితాల తేదీ ముందుగానే వెల్లడి చేస్తామని ప్రియాంక గాంధీ హామీ ఇచ్చారు.

ఇక తెలంగాణ రాష్ట్రంలో రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావని, అప్పులు పేరుకు పోయాయని, తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని, భూమి లేని రైతులకు ఏటా రూ. 12,000 ఇస్తామని ప్రియాంక గాంధీ హామీ ఇచ్చారు. ఇక రైతుల భూములను తెలంగాణ ప్రభుత్వం కొల్లగొడుతోందని, భూ మాఫియా చెలరేగిపోతోందని, ఈ అక్రమాలను అడ్డుకుంటామని ప్రియాంక గాంధీ స్పష్టం చేశారు.

ఇక మహిళలు ఎదుర్కొంటున్న కష్టాలు వర్ణనాతీతం అని, పిల్లల ఆరోగ్యం, కుటుంబ సమస్యలతో తల్లడిల్లిపోతున్నారని, గ్రామ గ్రామాన బెల్ట్ షాపులు, వైన్ షాపులు పెరిగిపోయాయని, మహిళల ఆర్థిక ఇబ్బందులు తీర్చేందుకు నెలకు రూ. 2,500లు మహిళల ఖాతాల్లో జమ చేస్తామని, పిల్లల చదువుకు ప్రతి విద్యార్థికి రూ. 5లక్షల ఆర్థిక సాయం చేస్తామని, ప్రతి మండలంలో అంతర్జాతీయ పాఠశాలను ప్రారంభిసామన్నారు. మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తేనే తెలంగాణాలో పురోభివృద్ధి ఖాయమన్నారు.

## బీఆర్ఎస్‌తోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యం : మంత్రి జగదీష్ రెడ్డి

సూర్యపేట, నవంబర్ 24: (నేటినిజం ప్రతినిధి): బీఆర్ఎస్‌తోనే మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని సూర్యాపేట బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేటలో పలువురు ముస్లింలలతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులర, కార్యకర్తలు బీఆర్ఎస్ చేరారు. వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ మైనార్టీల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు.

షాదీ ముబారక్, మైనార్టీ రెసిడెన్షియల్స్ వంటి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. అభివృద్ధి పనులు ఇలాగే కొనసాగాలంటే మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే రావాలని తెలిపారు. కారు గుర్తుకు ఓటేసి ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పర్వేజ్, మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ సయ్యద్ రియాజుద్దీన తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నడన్నా సింగరేణి చరిత్రలో రూ. 1000 కోట్లు పంచారా..? : సీఎం కేసీఆర్

భూపాలపల్లి, నవంబర్ 24: ఎన్నడన్నా సింగరేణి చరిత్రలో కార్మికులకు రూ. 1000 కోట్లు పంచారా అని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశ్నించారు. కానీ ఇవాళ బీఆర్ఎస్ గవర్నమెంట్ కార్మికులకు బోనస్, లాభాల వాటా కింద 32 శాతం ఇచ్చిందని కేసీఆర్ గుర్తు చేశారు. భూపాలపల్లి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని, గండ్ర వెంకటరమణారెడ్డికి మద్దతుగా ప్రసంగించారు.

సింగరేణి మనది మనకే ఉండే. ఉన్న తెలంగాణను ఊడగొట్టినట్టు, సింగరేణిని ముంచిది కూడా కాంగ్రెస్ పార్టీ. ఆ పార్టీకి చేత కాక కేంద్రం వద్ద అప్పులు తెచ్చి, అవి తిరిగి కట్టలేక 49 శాతం వాటా వాళ్లకు కట్టబెట్టారు. కాంగ్రెస్ చేతకాని తనం వల్ల వంద శాతం మనకున్న సింగరేణి, అప్పుల కింద కేంద్రానికి సగం వాటా పోయింది. ఇదే కాంగ్రెస్ ఇంటక్, ఐటక్ నాయకులు డిపెండెంట్ ఉద్యోగాలు వద్దని సంతకాలు పెట్టిన భక్తులు కూడా వాళ్లే. ఇవాళ 15 వేల మంది ఉద్యోగాలు ఇచ్చుకున్నాం. ఎన్నడన్నా సింగరేణి చరిత్రలో 1000 కోట్లు పంచారా..? బోనస్ కానీ, లాభాలా వాటా కానీ ఇవాళ 32 శాతం ఇచ్చుకుని ముందుకు పోతున్నాం. సింగరేణి అన్ని రకాలుగా కాపాడే బాధ్యత తీసుకుని ముందుకు పోతున్నాం అని కేసీఆర్ తెలిపారు.


భూపాలపల్లికి వంద శాతం ఇంజినీరింగ్ కాలేజీ తీసుకువస్తాం. ఆ బాధ్యత నాది అని మనవి చేస్తున్నా. భూపాల్లిని జిల్లా చేసిందే కేసీఆర్. గతంలో మధుసూదనాచారి ఉన్నప్పుడు రెండు, మూడు సార్లు వచ్చాను. భూపాలపల్లి చాలా అభివృద్ధి చేసుకున్నాం. వెంకటరమణారెడ్డి నా వద్దకు ఎప్పుడొచ్చినా నియోజకవర్గం పని అడుగుతడు. పర్సనల్ పని అడగలేదు. సీనియర్ నాయకుడు, అనుభవం ఉన్న నాయకుడు. తప్పకుండా భూపాలపల్లికి మేలు జరగాలంటే వెంకటరమణా రెడ్డి గెలవాలి. గెలిస్తేనే లాభం జరుగుతదీ. లేకపోతే కింద మీద అయితది, ఆగమయ్యే ఆస్కారం ఉంటది. మీరంతా పట్టుబట్టి వర్షంలో కూడా ఇంత పెద్ద సంఖ్యలో సభకు ఎలా హాజరయ్యారో, ఇదే పద్ధతిలో నవంబర్ 30న ఓట్లు వేయించి గెలిపించాలని కోరుతున్నా అని చెబుతూ కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

**నేటి కందం– నేటికి అందం**



అనయమ్ము సమాజములో
వనితలపై జరుగు హింస వలదని నుడువన్
ఘనులగు ప్రపంచ విదులీ
దినమును నెలకొల్పినారు దివ్యాశయులై ?

(నవంబర్ 25 మహిళలపై హింసను వ్యతిరేకించే అంతర్జాతీయదినం..)
(Nov 25: International Day for Elimination of Violence against women,,,)



–రాధశ్రీ
సెల్:9494481210

## ముస్లింల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యత : మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, నవంబర్ 24:ముస్లింల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యత ఇచ్చి వారిని ఆదుకుంటున్నారని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి, మేడ్చల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం ఘట్‌కేసర్‌లో నిర్వహించిన ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

రంజాన్ పండుగ సందర్భంగా పేదలకు నూతన వస్త్రాలు, విందులు ఇస్తూ అన్ని వర్గాలను సమానంగా గౌరవిస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వచ్చే బీజేపీ,కాంగ్రెస్‌లు ఓట్ల కోసమే పనిచేస్తాయని, బీఆర్ఎస్ మాత్రం అనుక్షణం ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలను సంపూర్ణంగా అభివృద్ధి చేశామని మంత్రి తెలిపారు. పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ లు పుర్తి స్థాయిలో అభివృద్ధిని సాధించాయని అన్నారు.

నియోజకవర్గంలో మరోసారి తనకు ఓటేసి గెలిపించాలని, కేసీఆర్ మరోసారి అధికారంలోకి రావాలంటే బీఆర్ఎస్ కు సంపూర్ణ మద్దతు తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మాధవ రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాక్షుడు వడిగెం వెంకటేశ్వరావు, నాయకులు ముల్లి పావనీ జంగయ్య యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, సుధాకర్, శ్రీనివాస్ గౌడ్, హరిశంకర్, సిరాజ్‌కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలతో మోసం : మంత్రి సబిత ఇంద్రారెడ్డి



రంగారెడ్డి, నవంబర్ 24:కాంగ్రెస్ ఇస్తున్న ఆరు గ్యారంటీలను నమ్మి కష్టాలను తెచ్చుకోవద్దని నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఓటర్లకు సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె కందుకూరు మండలం నేదునూరు, మాన్యగూడ, దాసర్లపల్లి తండా, దాసర్లపల్లి, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, ఊట్లపల్లి సార్లరావులపల్లి, దెబ్బడగూడ, కందుకూరు గ్రామాల్లో రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని వదరాని పొట్టు పడుతుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఇస్తున్న ఆరు గ్యారంటీలను నమ్మి కష్టాలను తెచ్చుకోవద్దని, కర్ణాటక ప్రజలు అధికారాన్ని అప్పగిస్తే ప్రజలకు నరకం చూపిస్తున్నారని వివరించారు. అధికారంలోకి రావడానికి అరచేతిలో వైకుంఠం చూపిస్తుందని అన్నారు. కర్ణాటకలో మోసం చేసినట్లు తెలంగాణ ప్రజలను మోసం చేయడం ఎవరికీ సాధ్యం కాదని వెల్లడించారు. ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రానికి ఇచ్చింది గుండు సున్నా అన్నారు.

రాష్ట్రానికి సీఎం కేసీఆర్ పాలన కావాలని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని ఆమె స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం కోరే కేసీఆర్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో చిలకమర్రి నర్సింహ, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభద్రతా వలయంలో విశ్వ మహిళ ..!

## (25 నవంబర్ "అంతర్జాతీయ మహిళా అత్యాచార వ్యతిరేక దినం" సందర్భంగా)

ప్రకృతిలో స్త్రీ పురుషులు సర్వసమాన భాగాలే అయినప్పటికి, స్త్రీజాతిని ద్వితీయ శ్రేణి పౌరులుగా లింగ వివక్షతో అణిచి వేస్తూ, వారి పట్ల చులకన భావనలు, వేధింపులు, అత్యాచారాలు, హత్యలు, బాలికలపై లైంగిక దాడులు, బాల్యవివాహాలు, అక్రమ రవాణ, రేప్‌లు, భ్రూణహత్యలు, గృహ హింసలు, బాలకార్మికులు అన్ని దేశాల్లో సర్వసాధారణ సమస్యలుగానే కనబడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 35 శాతం మహిళలు తమ జీవితకాలంలో ఏదో ఒక రకమైన లైంగిక వేధింపులను అనుభవిస్తున్నారని, వీరిలో 40 శాతం అబలలు వేధింపుల నుండి సహాయాన్ని కోరుతున్నారని, 10 శాతం మాత్రమే స్త్రీలు మాత్రమే న్యాయం కోసం చట్టాన్ని ఆశ్రయిస్తున్నారని తేలింది. మహిళలపై అత్యాచారాలు జరిగినపుడు జనావేశం క్షణాల్లో పొంగడం, వ్యతిరేక గళాలు మిన్నంటడం, రెండు రోజుల తరువాత అన్ని మరిచి పాత కథలు పునరావృతం కావడం సర్వసాధారణం అయ్యింది. ప్రతి రోజు ఏదో ఒక మూలన మహిళ మానభంగ మౌన రోధన గొంతు దాటడం లేదు, విని స్పందించేందుకు బదులు ఎగతాళి, ప్రతి దశలో అవమానాలు, చిన్నచూపు చూసే సమాజం మనది.

### అతివలపై అత్యాచారాలు:

ఐరాస వివరాల ప్రకారం మానవ అక్రమ రవాణాలో 71 శాతం మహిళలు, బాలికలే ఉన్నారని అంచనా. వివాహిత మహిళల్లో 52 శాతం మాత్రమే కొంత స్వేచ్ఛను అనుభవిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అధిక రేప్ కేసులు నమోదైన దేశాల జాబితాలో (లక్ష మందిలో) దక్షిణ ఆఫ్రికా (132.4), బోత్సవానా (92.9), స్వీడెన్ (63.5), గ్రనెడా (30.6), అమెరికాలో (27.3) లాంటి దేశాలు అగ్ర భాగాన ఉన్నాయి. అమెరికాలో 9 శాతం రేపిస్టులపై విచారణలు జరుగగా, 3 శాతం మాత్రమే శిక్షలు అనుభవిస్తూ, 97 శాతం రేపిస్టులు స్వేచ్ఛగా బయట హీరోల్లా తిరుగుతున్నారు. వాస్తవానికి మహిళలలపై జరిగే అధిక అత్యాచార కేసులు బయట పడడం లేదు. సమాజ చులకన భావం ఎదుర్కోవలసి వస్తుందని, మహిళ భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతుందనే కారణాలతో, వారికి జరిగిన అన్యాయాన్ని సహిస్తూ దుర్భర బతుకులు ఈడ్చుతున్నారు. కోవిడ్-19 విజృంభన తరువాత వచ్చిన సామాజిక మార్పుల కారణంగా కూడా మహిళలపై గృహ హింస వేధింపులు కూడా పెరిగాయని తేలింది. ప్రపంచ మహిళాలోకంపై జరుగుతున్న అత్యాచారాలు, హింసాత్మక పోకడలను గమనించిన ఐరాస సభ్యదేశాలు 2000 నుంచి ప్రతియేటా 25 నవంబర్ రోజున 'అంతర్జాతీయ మహిళా అత్యాచార వ్యతిరేక దినం' పాటించుట జరుగుతోంది. 25 నవంబర్ 1960న డొమినికన్ రిపబ్లిక్‌లో జరిగిన ముగ్గురు బిరాబల్ సిస్టర్స్ హత్యకు నిరసనగా ఈ రోజును పాటిస్తున్నారు. "మహిళా హింసకు 'నో' చెబుదాం" అంటుంది యునెస్కో. ఐక్యతతో మహిళా హింసను అడ్డుకోవాలనే లక్ష్యంతో 25 నవంబర్ నుండి 10 డిసెంబర్ వరకు లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా 16 రోజుల కార్యక్రమాలను ఐరాస చేపడుతున్నది.

### 'నిర్భయ'ల రక్షణ కరువు:

ప్రపంచవ్యాప్తంగా మానభంగాల రేటులో 120 దేశాల్లో భారత్ 95వ స్థానంలో ఉంది. భారత్‌లో నిర్భయలు, దిశలు, హత్రాస్‌లు ఎన్ని జరిగినా, ప్రభుత్వ యంత్రాంగం హడావుడీ, ప్రజల క్షణికావేశాలు ప్రదర్శించడం తప్ప ఊహించిన సమూల మార్పులు రావడం లేదు. ఇండియాలో రేప్‌ల రేటు 4.2 శాతం (ఒక లక్షలో) ఉండగా, చండీఘర్ 20.7 శాతం, రాజస్థాన్ 15.9 శాతం, ఢిల్లీ 13.5 శాతం, కేరళ 11.1 శాతం, హర్యానా 10.9 శాతం, అస్సాం 10.5 శాతం, హిమాచల్ 10.0 శాతంతో ముందు ఉండగా గుజరాత్ 1.6 శాతం, కర్నాటక 1.6 శాతం, తమిళనాడు 1.0 శాతం, నాగాలాండ్ 0.8 శాతంతో చివరన ఉన్నాయి. ఈ జాబితాలో తెలంగాణ 4.7 శాతం, ఆంధ్రప్రదేశ్ 4.2 శాతం రేప్ రేటు నమోదు అయినాయి. మన దేశంలో ప్రతి 16 నిమిషాలకు ఒక రేప్ కేస్ బయట పడడం అత్యంత అవమానకరం. 2019లో దేశ రాజధాని ఢిల్లీలో అత్యధికంగా 1,253 కేసుల సంఖ్య, జైపూర్‌లో అధిక రేప్ రేటు నమోదైనాయి. గత పది సంవత్సరాల్లో దేశంలోని 66 శాతం రేప్ కేసులు రాజస్థాన్, యంపీ, కేరళ, యూపీ, మహారాష్ట్ర, అస్సాం, హర్యానా, ఝూర్ఖండ్, ఒడిసా, ఢిల్లీ రాష్ట్రాలలో జరిగాయి. ఈ రాష్ట్రాల్లో గత 10 సంవత్సరాల్లో రేప్ కేసులు రెట్టింపు కాగా మిగిలిన 26 రాష్ట్రాల్లో మానభంగ కేసులు పెరగలేదని తేలింది. ఈ రాష్ట్రాల్లో గత దశాబ్దకాలంలో రేప్ కేసులు నాలుగు రెట్లు పెరగడం విచారకరం. 2019లో జరిగిన రేప్ కేసుల్లో 16.2 శాతం దళిత మహిళలు, 83.8 శాతం ఇతర వర్గాల మహిళలు ఉన్నారని తెలుస్తున్నది.

### మైనర్ బాలికల అక్రమ రవాణా భూతం:

సహజంగా మదమెక్కిన మానవ మృగాలు బలహీన అతివలపై చేసే అత్యాచారమే మానభంగ దుర్మార్గం. 'హూమన్ రైట్స్ వాచ్' నిర్వహించిన సర్వే ప్రకారం ప్రతియేటా భారత్‌లో 7,200 మైనర్ బాలికలు (ఒక లక్షలో 1.6) రేప్‌కు గురుకావడం జాతికి సిగ్గు చేటుగా గమనించాలి. మైనర్ బాలికల రేప్ కేసుల తరువాత వారిని అక్రమ మానవ రవాణా ద్వారా జీవితకాలం వ్యభిచార నరక కూపంలోకి నెట్టబడడం కూడా జరుగుతున్నది. భారతదేశంలో నమోదైన రేప్ కేసులలో 27.8 శాతం (నలుగురు రేపిస్టుల్లో ఒక్కరు) నిందితులకు మాత్రమే ఆలస్యంగానైనా శిక్షలు పడుతున్నాయి. దేశ జనావేశం కట్టలు తెంచుకున్న ఢిల్లీ నిర్భయ కేసులోనే నిందితులకు శిక్ష పడడానికి ఆరు సంవత్సరాలకు పైగా సమయం పట్టడం దురదృష్టకరం. ఈ ఆలస్యానికి కారణం పోలీస్ యంత్రాంగమని న్యాయ వ్యవస్థ వేలు చూపితే, న్యాయ వ్యవస్థ, నిందితులు, భాదితులే ఆలస్యానికి బాధ్యులని పోలీసులు అనడం సర్వ సాధారణం అయ్యింది. న్యాయం ఆలస్యంగా అందితే, న్యాయం అందనట్లే అని అందరం భావించాలి. 16 నుంచి 24 ఏండ్ల యువతులు అధిక శాతం మానభంగానికి గురి అవుతున్నట్లు తేలింది. రేప్ చేసిన మానవ మృగాల్లలో 70 శాతం భాదితురాలికి తెలిసిన వారే ఉన్నారని గమనించాలి. విద్యావంతులు, నాగరికత తెలిసిన పెద్దలు ఎక్కువగా ఉన్న ఢిల్లీ, ఛండీఘర్ మహానగరాల్లో మానభంగాలు ఎక్కువగా నమోదుకావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. రేపిస్టులకు వెంటనే శిక్షలు పడేలా న్యాయ మరియు పోలీస్ వ్యవస్థలు కాల పరిధిలో చర్యలు తీసుకోవాలి. మానభంగం తరువాత హత్య చేయడం పరిపాటి అయ్యింది. ఇలాంటి క్రూరులకు వెంటనే ఉరి శిక్ష పడడమే ఏకైక మార్గం.

నేటి తల్లితండ్రులు తమ పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించే ప్రయత్నం చేయాలి. యూనివర్సిటీల డిగ్రీల కన్న మానవీయ విలువలే ప్రధానమని, చదువు కన్న సంస్కారమే మిన్నయని గుర్తించాల్సిన సమయమిది. ప్రతి అమ్మాయి భారతమాత ముద్దు బిడ్డగా పూజించబడాలి. నేటి అమ్మాయిలు అవసరమైతే సబలలుగా మారి, మృగాళ్ల మదాన్ని అణిచే అపరకాళిగా గర్జించాలి. స్త్రీలో ఐశ్వర్య లక్ష్మిని, చదువుల తల్లి సరస్వతిని, ధైర్య ప్రతీక దుర్గలను దర్శించే నాగరిక భారత సమాజాన్ని నిర్మించే మహాయజ్ఞంలో మనందరం భాగస్వాములం అవుదాం. భరతమాతకు, మాతృ సమాన మహిళకు ప్రణమిల్లుదాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ఇందిరమ్మ రాజ్యంతోనే ప్రజా సంక్షేమం

## -సూర్యాపేట కాంగ్రెస్ అభ్యర్థి రామిరెడ్డి దామోదర్ రెడ్డి



సూర్యాపేట నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);రాష్ట్రంలో టిఆర్ఎస్ అవినీతి పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఇందిరమ్మ రాజ్యంతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని సూర్యాపేట కాంగ్రెస్ అభ్యర్థి రామిరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు .శుక్ర వారం, నాడు సూర్యాపేట మండలం ఆరె గూడెం, దాస్ తండా ఎర్కారం,పిల్లల మర్రిరాయన్ గూడెం,కుప్పిరెడ్డి గూడెం,ఐ.ం.న్నారంకాసరబాదకేసారం,,బాలెంల గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని పేద బడుగు బలహీన కార్మిక కర్షక కూలీల జీవితాల్లో వెలుగులు నింపేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాలకు సమన్యాయం దక్కుతుందని ఆయన అన్నారు. బడుగు బలహీన వర్గాలకు పక్కా ఇండ్లు పట్టాల పంపిణీ గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించింది ఇందిరమ్మ రాజ్యంలోనే నని ఆయన గుర్తు చేశారు. ఇక్కడి ప్రాంత విద్యార్థులు యువకుల బలిదానాలు చూసి చలించిన సోనియమ్మ తెలంగాణ ఇస్తే 10 ఏళ్ల నుండి అవినీతి పాలనతో రాష్ట్రంలో కేసీఆర్ జిల్లాలో జగదీష్ రెడ్డి వేలకోట్ల అక్రమ ఆస్తులు కూడా పెట్టారని ఆయన విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని అందుకు ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు మద్దతు తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కాంగ్రెస్ నాయకులు వివిధ గ్రామాల పార్టీ కాంగ్రెస్ నాయకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలు గ్రామాల్లో ఆయన సమక్షంలో బిఆర్ఎస్ బిజెపిలకు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# రేషన్ బియ్యం దందాకు పాల్పడితే మిల్లు సీజ్ చేయడం ఖాయం

## – పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాశిల్దార్ రఘునందన్

రంగ రెడ్డి జిల్లా నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రేషన్ బియ్యం దందా కు పాల్పడితే మిల్లు సీజ్ చేయడం ఖాయమని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాశిల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు.ఆమనగల్లు లో ఉన్న రైస్ మిల్లుల పై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు.రైస్ మిల్లు ల్లో రైతుల,వడ్ల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాసిల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు.శుక్రవారం నాడు ఆయన ఆమన్ గల్ లో అనుమానిత రైస్ మిల్లు లను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ.. రేషన్ బియ్యం దందా చేస్తున్నట్టు ఆరోపణలు ,ఫిర్యాదులు వస్తున్న దరిమిలా.. ఆయా మిల్లు ల్లో ఉన్న వడ్ల ను ,మిల్లింగ్ చేసిన బియ్యాన్ని పరిశీలించినట్లు చెప్పారు. మిల్లర్లు ఫామ్ (బి) లో రైతుల,వడ్ల వివరాలను నమోదు చేయాలని సూచించారు.

# కాంగ్రెస్‌తోనే కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనం సాధ్యం

## -కార్మిక క్షేత్రంలో అతిపెద్ద ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం చేయిస్తా
## -ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల గేట్ మీటింగ్‌లో మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

రామగుండం నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాల సమస్య కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి ఎం.ఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు. ప్రజాదీవెన పాదయాత్రలో భాగంగా నేడు ఎన్టీపీసీ కాంట్రాక్టు వర్కర్స్ గేట్ మీటింగ్ లో జరిగిన ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, కార్మిక క్షేత్రంలో అతిపెద్ద ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయడానికి అవసరం ఐతే ఢిల్లీ పెద్దలతో పోరాడుతానని ఆయన అన్నారు.కాంట్రాక్టు జేఏసీ నాయకులు ఇచ్చిన వినతి పత్రాలపై స్పందించి, వాటి పరిష్కారం తప్పక చూపిస్తానని రాజ్ ఠాకూర్ తెలిపారు .గత పది సంవత్సరాలుగా కాంట్రాక్టు కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతూ బ్రతుకు భారంగా మారి వేదన పడుతున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు ప్రస్తుత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గత కొంతకాలంగా పెండింగ్ లోనే ఉన్నవని,కార్మికుల సమస్యలపై బీఆర్ఎస్ పాలకులు మొసలి కన్నీరు కార్చిందే తప్పితేఎక్కడ కూడా స్పందించి, సమస్యల పట్ల



పరిష్కారం చూపిన పాపాన పోలేదని, ఎన్.టి.పి.సి కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉ న్నానని ఆయన వివరించారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం అమలయే విధంగా పోరాడుతా నని,డిపెండెంట్ ఉద్యోగాలు సత్తా ఉ న్నంత వరకు వయసుతో సంబంధం లేకుండా అవకాశం కల్పిస్తానని,ప్రతి కార్మికుడు వైద్య సదుపాయం అందుబాటులో ఉండే విధంగా పారిశ్రామిక క్షేత్రంలో అతిపెద్ద ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మించి కార్మికులకు వైద్య సదుపాయం అందుబాటులోకి తీసుకు వస్తానని,అలాగే కార్మికులకు ప్రమాద భీమా 10 లక్షల రూపాయల వరకు కేటాయిస్తామని, ఈపీఎఫ్, ఈఎస్ఐ, హెచ్ఆర్ఏ టిఏ,డిఏ అలాగే ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సమానంగా అన్ని సౌకర్యాలు కాంట్రాక్టు వర్కర్స్ కు చెందాలని, అవసరమైతే దేశ రాజధాని ఢిల్లీ నడి ఒడ్డున పోరాడడానికి కూడా వెనుకాడనని,బిఆర్ఎస్ పార్టీ ప్రలోభాలకు లొంగకుండా చేయి గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని,మార్పు రావాలంటే కాంగ్రెస్ గెలవాలని కార్మికుల సమస్యల పరిష్కారం కొరకై ఎక్కడికైనా వెళ్తానని ఎవరితోనైనా పోరాడుతానని,నవంబర్ 30న జరిగే ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికుల జేఏసీ యూనియన్ నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలతో పాటు అధిక సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు...

# తండ్రి గెలుపుకోసం తనయుడి ఆరాటం.. ఇంటి ఇంటికి వెళ్ళి ప్రచారం



హైదరాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);అంబర్ పేట నియోజకవర్గములో బి.ఆర్.ఎస్ నుండి రెండోసారి పోటీ చేస్తున్న తన తండ్రి అయిన కాలేరు వెంకటేష్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ తనయుడు కాలేరు మణికంఠ రత్నానగర్ లో ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంచుతూ కోరారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ అంబర్ పేటలో తన తండ్రి చేసిన అభివృద్ధే గెలిపిస్తుందని, బి.జె.పి, కాంగ్రెస్ వాళ్ళు చేయలేని అభివృద్ధి కాలేరు వెంకటేష్ చేసారని నియోజకవర్గంలోని ప్రజలకు ఇండ్లు లేని వారికి డబుల్ బెడ్ రూంలను ఇప్పించారని,ముస్లీం సోదరులకు శ్మశాన వాటిక కొరకు మూడు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వంతో మాట్లాడి ఇప్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తాలుకా రాజేష్ ,భాస్కర గౌడ్,సతీష్ గౌడ్,వనం రమేష్,శ్యాంమ్,అరుణ్,రఘు మరియు రత్నానగర్ వాసులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ లీకై ఒకే కుటుంబానికి నలుగురు తీవ్రంగా గాయాలు

విశాఖపట్టణం నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ : విశాఖ జిల్లా కేంద్రంలో గ్యాస్ సిలిండర్ లీకై ఒకే కుటుంబానికి నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. జిల్లా కేంద్రంలోని మధురవాడ వాంబే కాలనీలో నివాసముంటున్న బాలరాజు అనే వ్యక్తి అయ్యప్పమాల ధరించాడు. శుక్రవారం వంట గ్యాస్ అయిపోవడంతో కొత్త సిలిండర్‌కు రెగ్యులేటర్‌ను అమర్చాడు. అయితే రెగ్యులేటర్‌ను సక్రమంగా అమర్చలేదు.గ్యాస్ లీకేజీ అయిన విషయం గమనించకుండా కొద్ది సేపు అనంతరం దేవుడి చిత్రపటాల వద్ద దీపారాధన చేయడానికి అగ్గి వెలిగించడంతో ఒక్కసారిగా ఇంట్లో మంటలు వ్యాపించాయి. దీంతో బాలరాజుతో పాటు భార్య చిన్ని, కుమారులు గిరి, కార్తిక్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ నలుగురిని 108 అంబ్‌లెన్స్‌లో కింగ్ జార్జ్ ఆసుపత్రికి తరలించారు.

# కాంగ్రెస్‌కు మాదిగలు అండగా నిలవాలి

## - జిల్లాలో 10కి10 కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి
## - మాదిగలను విస్మరించిన బీఆర్ఎస్ బుద్ధి చెప్పండి
## - కాంగ్రెస్ రాష్ట్రనాయకులు పిడమర్తి రవి

ఖమ్మం, నవంబర్ 24:(నేటి నిజం ప్రతినిధి): గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా దళిత ముఖ్యమంత్రి హామీ నుండి, దళితుడికి మూడు ఎకరాలు భూమి, డబుల్ బెడ్ రూమ్ లు, ఎస్సీ కార్పొరేషన్ నిధులను పక్కదారి పట్టించి మాదిగల అభివృద్ధికి




అడ్డుకట్ట వేసి రాష్ట్రంలో మాదిగలను మోసం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ కు తగిన బుద్ధి చెప్పేవిధంగా ఖమ్మం జిల్లాలో పదికి పది సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలిచే విధంగా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పిడమర్తి రవి అన్నారు.

ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పిడమర్తి రవి, వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్ లు మాట్లాడుతూ...ఎస్సీ వర్గీకరణ మంద కృష్ణమాదిగ చేతకాదని, నేనే చేస్తానని కేసీఆర్ హామీ ఇచ్చి రాష్ట్రంలో మాదిగలకు తీవ్ర అన్యాయం చేశాడన్నారు. కేవలం మాదిగ కాబట్టే తాటికొండ రాజయ్యను మంత్రి పదవి నుండి తొలగించారని అన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలను ఓట్ల కోసమే వాడుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ మోసం చేశాడన్నారు. బిఆర్ఎస్ పార్టీలో ఒక్క జిల్లా అధ్యక్ష పదవిని కూడా మాదిగలకు ఇవ్వలేదన్నారు. అవకాశం ఉన్నప్పటికీ యూనివర్సిటీలలో వైస్ ఛాన్సలర్ గాని, జిల్లా పరిషత్ చైర్మన్ గాని మాదిగలకు కేటాయించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఐపిఎస్ అధికారి కృష్ణ ప్రసాద్ డిజిపి అయ్యే అవకాశం ఉన్నప్పటికీ కేవలం మాదిగ సామాజిక వర్గం కావడం వల్లనే ఇవ్వలేదన్నారు. వర్గీకరణ చేస్తామని ప్రధాని మోడీ చెప్పి మళ్లీ కమిటీ వేయడం కాలయాపన కోసమేనన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసమే ఈ హామీలు ఇస్తున్నారని విమర్శించారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే డిసెంబర్ 4 నుండి 22 వరకు జరిగే పార్లమెంటు సమావేశాల్లో బిల్లు పెట్టి ఎస్సీ వర్గీకరణ చేయాలన్నారు. కేవలం 3,4 చోట్ల గెలిచే అవకాశం ఉన్న బిజెపి పార్టీ బీసీ ముఖ్యమంత్రిని ఎలా చేస్తుందన్నారు. బిసి ముఖ్యమంత్రి, ఎస్సీ వర్గీకరణ పేరుతో అటు బీసీలను ఇటు ఎస్సీలను ఎలక్షన్లకు వాడుకుంటుందని విమర్శించారు. నెల రోజులో ఇళ్ల స్థలాలు ఇస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చి జర్నలిస్టులనే మోసం చేసిన ఘనత బిఆర్ఎస్ పార్టీకే దక్కిందన్నారు. అందుకే బీఆర్ఎస్, బీజేపీలను ఓడించాలన్నారు. ఖమ్మం జిల్లాలో పదికి పది స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో రవీంద్ర బాబు, రాకేష్ చంద్ర, కాంపాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి లీడర్లు కార్యకర్తలు నూతన ఉత్సాహం నింపుతున్న లక్ష్మి సుకన్య

భద్రాచలం నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);బిజెపి పార్టీ పై గల అభిమానం తో ఏపీ రాష్ట్రం గుంటూరుకు చెందిన బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా మోర్చ నాయకురాలు పంద్రంగి లక్ష్మి సుకన్య బిజెపి స్టార్ క్యాంపెనర్గా భద్రాచలంలో తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్మి సుకన్యరాకతో భద్రాచలం బిజెపి లీడర్లు కార్యకర్తలు నూతన ఉత్సాహంతో ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. ఆమె మృదువైన మాటలకు ఆకర్షితులై దుమ్ముగూడెం మండలం పొలూరిపేట గ్రామంలో 80 కుటుంబాలు భద్రాచలం బిజెపి అభ్యర్థి కుంజా ధర్మారావు, పంద్రంగి లక్ష్మి సుకన్య ఆధ్వర్యంలో బిజెపి పార్టీలో చేరారు. ముఖ్యంగా మురికివాడలో మహిళలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటూ బిజెపికి ఓటు వేయడం ద్వారా భవిష్యత్తు బాగుంటుందని ఆవిడ ఉపన్యాసాలకు యువత మహిళలు బాగా ఆకర్షితులవుతున్నారు.

# భారత్ కీలక నిర్ణయం.. కెనడాలో ఈ-వీసా సేవల పునరుద్ధరణ

న్యూ డిల్లీ నవంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); కెనడాతో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవలే భారత్-కెనడా మధ్య ఏర్పడిన దౌత్య ప్రతిష్టంభనతో కెనడాలో నిలిపివేసిన వీసా సేవలను తాజాగా పునరుద్ధరించింది ఈ మేరకు సంబంధిత వర్గాలు వెల్లడించినట్లు జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. దాదాపు 2 నెలల తర్వాత కెనడా పౌరులకు నిలిపివేసిన ఈ-వీసా సేవలను బుధవారం నుంచి భారత్ పునరుద్ధరించినట్లు సదరు కథనాలు వెల్లడించాయి.ఖలిస్థాన్ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత్ ప్రమేయం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ట్రూడో ఆరోపణలతో రెండు దేశాల మధ్య దౌత్యసంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కెనడాలో వీసాల జారీ ప్రక్రియను సెప్టెంబర్ 21వ తేదీ నుంచి భారత్ నిలిపివేసిన విషయం తెలిసిందే. అయితే, కెనడా ప్రభుత్వం ఇటీవల చేసిన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై సమీక్షించిన అనంతరం ఇంచుమించు నెల రోజుల తర్వాత భారత్ తన నిర్ణయాన్ని మార్చుకుంది. అక్టోబర్ 26వ తేదీ నుంచి ఎంట్రీ వీసా, బిజినెస్ వీసా, మెడికల్ వీసా, కాన్ఫరెన్స్ వీసా సర్వీసులను పునరుద్ధరించింది. ఇప్పుడు తాజాగా ఈ-వీసా సేవలను కూడా పునరుద్ధరించారు.

# తెలంగాణ నా గుండెచప్పుడు..

**-ఆంధ్రా జన్మనిస్తే తెలంగాణ పునర్ జన్మనిచ్చింది**
**-తెలంగాణలో ఇంత అవినీతి ఉంటుందని తాను ఊహించలేదు**
**-కమీషన్ల రాజ్యం నడుస్తోంది.. ఇక పై తెలంగాణలో జనసేన ఉంటుంది**
**-జనసేన అధినేత పవన్ కల్యాణ్**

హనుమకొండ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ."తెలంగాణ నా గుండెచప్పుడు. ఇకపై తెలంగాణలోనూ అడుగుపెడుతున్నాను. తెలంగాణ ధైర్యంతోనే ఆంధ్రాలో రౌడీలను, ఫ్యాక్షనిస్టులను ఎదుర్కొంటున్నాను" అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు.ఆంధ్రాలో రౌడీలు రాజ్యామేలుతున్నారని, గూండాల పాలన నడుస్తోందని, అలాంటి పరిస్థితుల్లో తట్టుకుని నిలబడుతున్నానంటే వరంగల్ పోరాటస్ఫూర్తే కారణమని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. బుధవారం వరంగల్ నియోజకవర్గంలో బీజేపీ నిర్వహించిన విజయ సంకల్ప బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడా రుబలిదానాలతో సాధించుకున్న తెలంగాణలో ఇంత అవినీతి ఉంటుందని తాను ఊహించలేదని పవన్ కల్యాణ్ అన్నారు. కమీషన్ల రాజ్యం నడుస్తోందని మండిపడ్డారు. ఆంధ్రా జన్మనిస్తే తెలంగాణ పునర్ జన్మనిచ్చిందని అన్నారు. పదేళ్లలో తాను తెలంగాణపై మాట్లాడలేదని అన్నారు. ప్రధాని అంటే తనకు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. దశాబ్దం తర్వాత మాట ఇస్తున్నానని... వచ్చే ఏడాది నుంచి ఆంధ్రాలో లాగే తెలంగాణలోనూ తిరుగుతాను అని జనసేనాని స్పష్టం చేశారు.బీసీ ముఖ్యమంత్రి కావాలని కోరుకునే వారిలో తాను కూడా ఉన్నానన్నారు. తెలంగాణలో జనసేన ఉంటుందని.. తెలంగాణలో బీజేపీతో కలిసి పనిచేస్తామని వెల్లడించారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితోనే జనసేన స్థాపించామని తెలిపారు. 2009లో స్థాపించిన పార్టీ ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని నిలబడటానికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే కారణమని చెప్పుకొచ్చారు. నాడు తెలంగాణకు మద్దతు ఇచ్చిన వారిలో తాను ఒకడిని అని అన్నారు. బీజేపీ అభ్యర్థులు రావుపద్మ, ప్రదీప్ రావును గెలిపించాలని కోరారు. సమస్యలొస్తే తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తెలంగాణలో దళిత ముఖ్యమంత్రిని చూడలేకపోయామని.. బీసీ ముఖ్యమంత్రినైనా చూడాలని అందుకే బీజేపీతో కలిసినట్లు తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ రావు గెలిపించాలని కోరారు. అన్ని నియోజకవర్గాల్లో జనసేన - బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పవన్ కళ్యాణ్ కోరారు.

# కాంగ్రెస్ తోనే అన్ని రంగాల్లో ఆర్య వైశ్యుల అభివృద్ధి

**-సూర్యాపేట కాంగ్రెస్ అభ్యర్థి మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి**

సూర్యాపేట నవంబర్ 24(ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఆర్యవైశ్యులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని సూర్యాపేట కాంగ్రెస్ అభ్యర్థి మాజీ మంత్రి రామిరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. బుధవారం నాడు సూర్యాపేటలోని రవి మహల్ లో జరిగిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కాంగ్రెస్ పార్టీ ద్వారానే ఒక ఆర్య వైశ్య నాయకుడు రోశయ్యకు ముఖ్యమంత్రి గా సేవ చేసే అవకాశం లభించిందని ఇంతమంది ఆర్యవైశ్యులకు సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా అవకాశాలు కనిపించిన ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఆయన అన్నారు. ఆర్యవైశ్యులు స్వతహాగా తమ సొంత వ్యాపారాలు చేసి ఎవరిని ఇబ్బంది కలిగించకుండా బ్రతుకుతారని వారిది ఒకరికి పెట్టే చెయ్యి తప్ప అడుక్కుని తీసుకునే ఆలోచనలు ఉండవని ఆయన అన్నారు. రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవ కొరకు తన సొంత ఆస్తులు అమ్ముకున్న తనకు రాజకీయాన్ని వ్యాపారం చేసి కోట్లు కూడా పెట్టి అధికార ధన బలంతో విర్రవీగుతున్న ఇంకో నేతకు మధ్య జరుగుతున్న పోటీలో ఆర్యవైశ్యులు తనకు మద్దతు పలకాలని ఆయన అన్నారు. ప్రశాంతమైన సూర్యాపేట ప్రగతి బాటలో నడిపించాలి అంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని సూర్యాపేటలో కాంగ్రెస్ గెలవాలని అందుకు వ్యాపారవర్గాలంతా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు

# 'ఎప్పుడు డీఎస్సీ...ఇంకెప్పుడు నోటిఫికేషన్ జగనన్న"

**-వైసీపీ సర్కారుపై మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు విరుచుకుపడ్డారు**

విశాఖపట్నం నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: నెలలు గడిచిపోతున్నా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయడం లేదంటూ వైసీపీ సర్కారుపై మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు విరుచుకుపడ్డారు. "ఎప్పుడు డీఎస్సీ... ఇంకెప్పుడు నోటిఫికేషన్ జగనన్న. మన రాష్ట్రంలో డీఎస్సీ నోటిఫికేషన్.. 'మళ్లీ మళ్లీ పెళ్లి' డైలాగును తలపిస్తోంది. అదిగో డీఎస్సీ... ఇదిగో డీఎస్సీ.... అంటూ విద్యాశాఖ మంత్రి గారు మీడియా ముందు గొప్పలు... ఆ తర్వాత ఆ ఊసే ఉండదు. మొన్నటికి మొన్న వారంలో డీఎస్సీ నోటిఫికేషన్ అన్నారు. ఆ వారాలన్నీ దాటిపోయి నెలలు గడుస్తున్నాయి మంత్రిగారు. మెగా డీఎస్సీని కాస్త మినీ డీఎస్సీ చేశారు ఇప్పుడు దీనికి కూడా మోక్షం కలిగేలా లేదు. మంత్రి గారి మాటలు 'ఒట్టి విస్తరాకు మంచి నీళ్ళే' ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరోసారి నోటిఫికేషన్ల గారెడీతో నిరుద్యోగులను మరో మోసానికి తెర తీశారు తప్ప ఇంకోటి కాదు. ఎన్నికలకు ముందు రాష్ట్రంలో 23 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ అన్నారు...! ఆ తర్వాత ఏడాదికి ఒక డీఎస్సీ అన్నారు....! గిరిజన యువతకు ప్రత్యేక డీఎస్సీ అన్నారు..! మీకు అసలు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చే ఆలోచన ఉందా..? లేఖ ఇది కూడా మీ మ్యానిఫెస్టోలో రాలిపోయే రత్నంగానే మిగిలిపోతుందా..? ఉద్యోగాల నియామక ప్రక్రియ ఆలస్యమయ్యేకొద్దీ కొందరు నిరుద్యోగులకు వయసు రీత్యా అనర్హులవుతున్నారనే సంగతి గాలికొదిలేసి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఉద్యోగం కోసం వేలాది మంది నిరుద్యోగులు రొడెక్కి ఉద్యమాలు చేస్తున్న మీలో చలనం లేదు. నిరుద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దు జగన్మోహన్ రెడ్డి గారు. 2014లో... 9,061 పోస్టులతో, 2018లో... 7,729 పోస్టులతో మెగా డీఎస్సీలు ప్రకటించి వేలాది మంది నిరుద్యోగుల కుటుంబాలలో వెలుగులు నింపిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. రాష్ట్రంలోని నిరుద్యోగులు ముఖ్యంగా డీఎస్సీ అభ్యర్థులు అధైర్య పడాల్సిన అవసరం లేదు. 2024లో రానున్నది చంద్రన్న పాలనే. రాష్ట్రంలో అన్ని శాఖల్లో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసి మళ్ళీ మీ కుటుంబాలలో వెలుగులు నింపేది కూడా చంద్రన్న ప్రభుత్వమే" అని మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు.

# కేసీఆర్ రాసిపెట్టుకో.. కాంగ్రెస్‌కు 80 సీట్ల కంటే ఒక్క సీటు తగ్గదు

**-మేడిగడ్డ మూడేళ్లకే కుంగి పోయింది**
**-పోడు భూముల సమస్య తీరలేదు**
**-గిరిజనులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు**
**-టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి**

నిజామాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సీఎం కేసీఆర్ రాసిపెట్టుకో కాంగ్రెస్ పార్టీకి 80 సీట్ల కంటే ఒక్క సీటు తగ్గదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నాడు దర్పల్లిలో రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..."డిసెంబర్ 3వ తేదీన లెక్క చూసుకో కేసీఆర్.. 80 కంటే ఒక్కటి తక్కువున్నా ఏ చర్యకైనా సిద్ధం. కేసీఆర్‌కు పదేళ్లు అవకాశం ఇచ్చారు. ఇక్కడ పోడు భూముల సమస్య తీరలేదు. గిరిజనులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని 100 రోజుల్లో తీరుస్తానని పదేళ్లయినా తెరువలేదు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఇక్కడి రైతులు ఓడించారు. ఈ ప్రాంత రైతుల సమస్యలను బీఆర్ఎస్ నేతలు పట్టించుకోలేదు. బాజిరెడ్డి గోవర్ధన్ ఆర్టీసీ కార్మికులను నిర్లక్ష్యం చేసి వారి హక్కులను కాలరాశారు. అయ్య బక్కోడు.. కొడుకు తిరుగుబోతోడు.



ప్రజలను ఆదుకోవాలంటే ఒక్కరూ ముందుకు రారు. ఎర్రజొన్న రైతులపై పెట్టిన కేసులు ఎత్తేయలేదు. పసుపు బోర్డు తెస్తానన్న గుండోడు ఎక్కడికో పోయిండు. నేను పాదయాత్ర చేసినప్పుడు ఈ ప్రాంత యువకులు నన్ను ఇక్కడి నుంచి పోటీ చేయమని అడిగారు. అధిష్ఠానం నన్ను కామారెడ్డిలో పోటీ చేయమని ఆదేశించింది'' అని రేవంత్‌రెడ్డి తెలిపారు. మేడిగడ్డ మూడేళ్లకే కుంగి పోయింది "ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎవరు గెలుస్తారో రాష్ట్ర ప్రభుత్వం అదే వస్తుంది. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెస్తాం. మేడిగడ్డ మూడేళ్లకే కుంగి పోయింది. మీరు కట్టిన ప్రాజెక్టులు చూపించి బీఆర్ఎస్ నేతలు ఓట్లు అడగాలి. మేము కట్టిన శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు చూపించి ఓట్లు అడుగుతాం. ఇందిరమ్మ రాజ్యం అంటే గరీబోళ్ల రాజ్యం. బీఆర్ఎస్ అంటే దొరల రాజ్యం, దొంగల రాజ్యం. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తానని కేసీఆర్ ఊహాలోకంలో ఉంచారు. ఆయన మాత్రం 150 రూముల బంగ్లా కట్టుకున్నాడు. బోధన్ ఏసీపీకి చెప్తున్నా.. నీ నౌకరి నువ్వు చెయి.. బీఆర్ఎస్ కార్యకర్తలాగా చేయకు.. డిసెంబర్ 3వ తేదీ తర్వాత ఏమైతదో చూడు కేసీఆర్" అని రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు.

# గెలుపు పక్కా మెజారిటీయే లెక్క..ఐదుడివిజన్లలో మెజారిటీ తథ్యం

**-డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్**




సికింద్రాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తెలంగాణా రాష్ట్రంలో బీ ఆర్ ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ తో పాటు , తాను కూడా హ్యాట్రిక్ సాధించడం తథ్యమని డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ బీ ఆర్ ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. బుధవారం సితాఫలమండీ లో స్థానిక కార్పొరేటర్ సామల హేమతో కలిసి ఎన్నికల ప్రచార పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమ ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి నిరంతరం శ్రమించామని, కొన్ని పార్టీ లు కేవలం ఎన్నికల సందర్భాల్లో మాత్రమే ప్రజల వద్దకు వస్తున్నాయని అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం లోని అయిదు డివిజన్ల మధ్య మెజారిటి సాధించేందుకు పోటీలు నెలకొనడం తమ పార్టీ కార్యకర్తల ఆత్మ విశ్వాసానికి దర్పణమని అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం అన్ని రంగాల్లో పురోగమించిందని తెలిపారు. కార్పొరేటర్లు కంది శైలజ, రాసురి సునీత, నేతలు కరాటే రాజు, కిరణ్ కుమార్ గౌడ్, రామేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మేడి బావి, ఇందిరానగర్ కాలనీ, బీదల బస్తీ, శ్రీనివాస్ నగర్, సీతారాం నగర్ తదితర ప్రాంతాల్లోఅయన పర్యటించారు.

# ఈ నెల 26 వరకు రాష్ట్రములో వానలు

**-డీఆర్ఎఫ్, మున్సిపల్ సిబ్బందిని అప్రమత్తం చేసిన జీహెచ్ఎంసీ అధికారులు**

హైదరాబాద్ నవంబర్24(ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: హైదరాబాద్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గురువారం ఉదయం నుంచి నగరంలో ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉన్నది. దీంతో అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తున్నాయి. కర్మన్ ఘాట్, చంపాపేట్, సంతోష్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్, తార్నాక, పాతబస్తీ, జియాగూడ, మెహదీపట్నం, అమీర్‌పేట, ఎస్సానగర్, కూకట్‌పల్లి, బేగంపేట , సికింద్రాబాద్, పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, నాంపల్లి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ లో వర్షం కురుస్తున్నది. పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయుమయ్యాయి.కాగా, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం మోస్తారు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. గురువారం నుంచి ఈ నెల 26 వరకు వానలు కురుస్తాయని పేర్కొంది. ఈనేపథ్యంలో డీఆర్ఎఫ్, మున్సిపల్ సిబ్బందిని జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తం చేశారు. ఇక బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరిత ఆవర్తనం వల్ల రాష్ట్రంలోని పలుచోట్ల ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# బీసీవై పార్టీకి సంపూర్ణ మద్దతు తెలిపిన సదాశివపేట మండల ప్రజలు



సంగారెడ్డి నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); సంగారెడ్డి నియోజకవర్గంలో సదాశివపేట మండలం ప్రజలు బీసీవై పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ కు ఘన స్వాగతం పలికారు. ఆయనకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ గెలుపుకు నాంది పలికారు. ఈ యొక్క మండల రోడ్ షో మరియు సభల కార్యక్రమాలలో పాల్గొన్న బీసీవై పార్టీ కార్యకర్తలు మరియు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర యాదవ్ మేనిఫెస్టోకు ముగ్దులై పార్టీ లో భారీ సంఖ్యలో మండల ప్రజలు చేరారు.

# సుస్థిరమైన పరిపాలన అందించాలంటే మళ్ళీ బిఆర్ఎస్‌నే గెలిపించాలి..

**- రైతు సంఘం నేత బియ్యపు శంకర్ యాదవ్ పిలుపు**

హైదరాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );స్థిరమైన పరిపాలన అందించాలంటే మళ్ళీ బిఆర్ఎస్ నే గెలిపించి మల్లి కెసిఆర్ కే పట్టం కట్టాలని రైతు సంఘం నేత బియ్యపు శంకర్ యాదవ్ పిలుపు నిచ్చారు.కాంగ్రెస్ గెలిస్తే స్థిరమైన పరిపాలన అందించలేరని, ఈ విషయం గత చరిత్ర లో వెల్లడి అయినదని ఆయన పేర్కొన్నారు. ముఖ్య మంత్రి నేతృత్వం లోని బిఆర్ఎస్ ప్రభుత్వం గత 10 సంవత్సరాలనుండి స్థిరమైన పరిపాలన అందిస్తూ పేద బడుగు బలహీన వర్గాల మన్ననలు పొందిందన్నారు. రాష్ట్రము లో ముఖ్యంగా హైదరాబాద్ మహా నగరం లో ఎటువంటి మత కలహాలు జరగకుండా చూస్తూ,అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న మన బిఆర్ఎస్ నేత , కెసిఆర్ నే మళ్ళీ ముఖ్యమంత్రి గా ఎన్నుకొందామన్నారు. కాంగ్రెస్ వస్తే ఎవరు ముఖ్యమంత్రి అవుతారో, ఎన్ని రోజులుంటారో తెలియని పరిస్థితిని మనం చుసామన్నారు.ఇప్పటికే వారి పార్టీ లో సంధిగ్ద త నెలకొందని, ప్రజలు దీనిని గమనించి బిఆర్ఎస్ కు పాఠం కట్టి తెలంగాణ ను కాపాడుకుందామని శంకర్ యాదవ్ పేర్కొన్నారు.

# చైనాను వణికిస్తున్న అంతుచిక్కని న్యుమోనియా..

**- డేంజర్‌లో స్కూల్ పిల్లలు**

బీజింగ్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: కరోనా మహమ్మారి విలయం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రపంచ దేశాలను కలవరపాటుకు గురిచేసే వార్త ఇది. కరోనా మహమ్మారికి పుట్టినిల్లయిన చైనాలో మరో మహమ్మారి పురుడుపోసుకుంటున్నదన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. చైనాలోని బడుల్లో అంతుచిక్కని నిమోనియా వ్యాధి విజృంభిస్తున్నది. బీజింగ్, లియోనింగ్ నగరాల్లోని దవాఖానలు బాధిత చిన్నారులతో కిక్కిరిసిపోతున్నాయి. దీంతో తాజా పరిస్థితులు మునుపటి కరోనా సంక్షోభాన్ని గుర్తుకు తెస్తున్నాయి. కాగా, మిస్టరీ నిమోనియా వ్యాపిస్తుండటంతో స్కూళ్ల మూసివేత తప్పదని స్థానిక మీడియా వెల్లడించింది. బీజింగ్, లియోనింగ్ దవాఖానలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్టు పేర్కొన్నది. బాధిత చిన్నారుల్లో అధిక జ్వరం, ఊపిరితిత్తుల మంట వంటి అసాధారణ లక్షణాలు ఉన్నట్టు తెలిపింది. అయితే ఇతర శ్వాసకోశ వ్యాధుల్లో కనిపించే దగ్గు, ఇతర లక్షణాలు లేవని వివరించింది.కాగా ప్రపంచదేశాల్లో మనుషులు, జంతువుల్లో వ్యాపించే వ్యాధులను ట్రాక్ చేసే సర్వైవలెన్స్ ప్లాట్‌ఫామ్ ప్రోమెడ్ చైనాలో తాజా నిమోనియా వ్యాప్తి గురించి మంగళవారం బయటపెట్టింది. 2019లో కరోనా వ్యాప్తి గురించి కూడా ఈ సంస్థనే మొదట హెచ్చరించింది. చైనాలో తాజా శ్వాసకోశ వ్యాధి ఎప్పుడు మొదలైందో స్పష్టంగా తెలియదని పేర్కొన్నది. అలాగే పెద్దలు ఈ వ్యాధికి గురయ్యారా లేదా అన్న విషయాన్ని కూడా వెల్లడించలేదు. మరో మహమ్మారిగా ఇది మారుతుందా అన్నది ఇప్పుడే చెప్పలేమని వివరించింది.

# నేడు తెలంగాణ తొలి, మలి దశ, ఉద్యమకారుల ప్రత్యేక సమావేశం

**-తెలంగాణ ప్రజా సమితి పార్టీ అధ్యక్షురాలు నీరా కిషోర్**

హైదరాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ఏజెన్సీ );తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న తొలి, మలి దశ,ఉద్యమకారుల ప్రత్యేక సమావేశం ఈనెల 25వ తేదీన హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లోని ప్రకాశం హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రజా సమితి పార్టీ అధ్యక్షురాలు నీరా కిషోర్ తెలిపారు. ఉదయం 11 గంటల నుండి ప్రారంభంకానున్న ఈ ప్రత్యేక సమావేశానికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న తొలి, మలి దశ,ఉద్యమకారుల తరలిరావాలని ఆమె పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా నీరా కిషోర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధన కోసం పోరాడిన తొలిదశ, మలిదశ ఉద్యమకారుల విషయంలో ఎటువంటి సహాయం చేయకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ నియంతగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఉద్యమకారులందరికీ పెన్షన్, ఇండ్లస్థలాలు, ఉద్యోగాలు కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం హామీ ఇచ్చిన నేపథ్యంలో నిర్వహించనున్న సభకు అందరూ రావాలని నీరా కిషోర్ అన్నారు. ఉద్యమకారులందరూ తమతోపాటు ఆధార్ కార్డులను తీసుకురావాలని, తద్వారా భవిష్యత్ లబ్దిదారుల జాబితాను తాయారు చేయడం జరుగుతుందని నీరా కిషోర్ తెలిపారు.

# డీప్‌ఫేక్ సమాజానికి ప్రమాదకరం

**-వీలైనంత త్వరగా కొత్త నియంత్రణ మార్గదర్శకాలు**
**-కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్**

న్యూఢిల్లీ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: డీప్‌ఫేక్ సమాజానికి ప్రమాదకరంగా తయారైనట్లు కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. ఇవాళ వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లతో ఆయన చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో కొత్త నియంత్రణ మార్గదర్శకాలను వీలైనంత త్వరగా రూపొందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. కొన్ని వారాల్లోనే ఆ మార్గదర్శకాలకు చెందిన ముసాయిదాను అందుబాటులోకి వస్తుందన్నారు. మీడియా సమావేశంలో మంత్రి వైష్ణవ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి డీప్‌ఫేక్‌లు తీవ్ర ప్రమాదకరంగా మారినట్లు వెల్లడించారు. రష్మిక మందానా, కాజోల్, ప్రధాని మోదీకి చెందిన డీప్‌ఫేక్ వీడియోలు, ఇమేజ్‌లు ఇటీవల దుమారం రేపిన విషయం తెలిసిందే.సోషల్ మీడియా, ఏఐ కంపెనీలతో నిర్వహించిన మీటింగ్‌లో నాలుగు అంశాలను చర్చించినట్లు మంత్రి తెలిపారు. డీప్‌ఫేక్‌లను గుర్తించడం, పోస్టింగ్ చేయకుండా నియంత్రించడం, వైరల్ కాకుండా చూడడం, రిపోర్టింగ్ వైఖరి గురించి పలు కంపెనీలతో చర్చించినట్లు మంత్రి తెలిపారు. డీప్‌ఫేక్‌ల గురించి ప్రజల్లో చైతన్యం కలిగించే అంశం గురించి కార్యక్రమాలను నిర్వహించాలని మంత్రి చెప్పారు. ప్రభుత్వం, పరిశ్రమలు, మీడియా కలిసి పనిచేయాలన్నారు.

# బీసీ కులగణన పేరిట భారీ మోసానికి తెరలేపిన వైసీపీ

**-టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర**

అమరావతి నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్): బీసీ కులగణన పేరిట వైసీపీ భారీ మోసానికి తెరలేపిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బ్లాక్‌మెయిల్ చేసి బీసీలకు అందే లబ్ది తొలగించేందుకు కుట్ర పన్నారన్నారు. ప్రైవేటు సంస్థలకు బీసీల సమాచారమిచ్చి తమ బతుకులు తాకట్టు పెడుతున్నారన్నారు. మోసపూరిత రాజకీయాలతో ఎన్నికల్లో లబ్ది పొందాలని చేసే ప్రయత్నమే సామాజిక బస్సు యాత్రలు అని పేర్కొన్నారు. బీసీలను బానిసలుగా జగన్మోహన్ రెడ్డి దిగజార్చారన్నారు. వైసీపీ బీసీల పోరాట కార్యాచరణ త్వరలోనే ప్రకటిసామని కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ మాయ మాటలు నమ్మి మోసపోవద్దు

**- రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి రాజ్ ఠాకూర్**

రామగుండం నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రామగుండం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ 8ఇంక్లైన్ కాలని ప్రజలను కలుస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ,మన ప్రాంతాన్ని అభివృద్ధి చేయని శాసనసభ్యుడు మాయమాటలు చెప్పి మరోసారి ఓట్ల కోసం వస్తున్నారని ఆరోపించారు. ప్రజాహితం కోరే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీ తోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. అంతకు ముందు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను కలిసి వారి



సమస్యలను అడిగి తెలుసుకున్నారు.. పారిశుద్ధ కార్మికుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే పరిష్కరించి తీరుతామని, ప్రతి ఒక్కరూ చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

# కుటుంబ పాలనకు చరమగీతం పాడుదాం..రాష్ట్రాన్ని కాపాడుకుందాం

**- సికింద్రాబాద్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి మేకల సారంగా పాణి**

సికింద్రాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కుటుంబ పాలనకు చరమగీతం పాడుదాం..రాష్ట్రాన్ని రక్షించుకున్దామని అని సికింద్రాబాద్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి మేకల సారంగా పాణి అన్నారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా తార్నాక డివిజన్ లోని చింతల్ బస్తీ, తార్నాక, గోకుల్ నగర్, సండే మార్కెట్, నాగార్జున నగర్, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో మేకల సారంగా పాణి పాదయాత్ర చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజా వ్యతిరేక పాలనను అవలభిస్తున్న బీ ఆర్ ఎస్ ప్రభుత్వంకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.బిజెపి ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం పెద్ద పీఠ వేసినట్లు పేర్కొన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం లో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని,ఈసారి బిజెపి ప్రభుత్వం అధికారం లోకి రావడం ఖాయమని అన్నారు.బీసీ ల పక్షపాతి మోడీ అని, తెలంగాణ లో బిజెపి బీసీ ముఖ్యమంత్రి నీ ప్రకటించడం హర్షణీయం అని పేర్కొన్నారు. సికింద్రాబాద్ లో బిజెపి జెండాను ఎగురవేస్తారు తెలిపారు. ఈ కార్యక్రమం లో బిజెపి తార్నాక డివిజన్ అద్యక్ష్యులు రాము వర్మ, వేణు యాదవ్, వెంకటేష్ గౌడ్, పోచయ్య యాదవ్, సుబ్బారావు, ప్రకాష్, అనిత,అనూష, వేణు తదితరులు పాల్గొన్నారు.

# మళ్ళీ బిఆర్ఎస్‌నే గెలిపించాలి.. మల్లి కెసిఆర్ కే పట్టం కట్టాలి

హైదరాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );స్థిరమైన పరిపాలన అందించాలంటే మళ్ళీ బిఆర్ఎస్ నే గెలిపించి మల్లి కెసిఆర్ కే పట్టం కట్టాలని రైతు సంఘం నేత బియ్యపు శంకర్ యాదవ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ గెలిస్తే స్థిరమైన పరిపాలన అందించలేరని, ఈ విషయం గత చరిత్ర లో వెల్లడి అయినదని ఆయన పేర్కొన్నారు. ముఖ్య మంత్రి నేతృత్వం లోని బిఆర్ఎస్ ప్రభుత్వం గత 10 సంవత్సరాలనుండి స్థిరమైన పరిపాలన అందిస్తూ పేద బడుగు బలహీన వర్గాల మన్ననలు పొందిందన్నారు. రాష్ట్రము లో ముఖ్యంగా హైదరాబాద్ మహా నగరం లో ఎటువంటి మత కలహాలు జరగకుండా చూస్తూ,అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న మన బిఆర్ఎస్ నేత , కెసిఆర్ నే మళ్ళీ ముఖ్యమంత్రి గా ఎన్నుకొందా మన్నారు. కాంగ్రెస్ వస్తే ఎవరు ముఖ్యమంత్రి అవుతారో, ఎన్ని రోజులుంటారో తెలియని పరిస్థితిని మనం చుసామన్నారు.ఇప్పటికే వారి పార్టీ లో సంధిగ్ద త నెలకొందని, ప్రజలు దీనిని గమనించి బిఆర్ఎస్ కు పాఠం కట్టి తెలంగాణ ను కాపాడుకుందామని శంకర్ యాదవ్ పేర్కొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌళిక సదుపాయాల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి



ఖమ్మం, నవంబర్ 24:(నేటి నిజం ప్రతినిధి): పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌళిక సదుపాయాల కల్పన పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శుక్రవారం తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణి, తిరుమలాయపాలెం, పిండిప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బీసరాజుపల్లి తాండ, ఏదుళ్లచెరువు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి, పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పెయింటింగ్ వేయించాలని, టాయిలెట్ రన్నింగ్ వాటర్ తో ఉండాలని, చిన్న చిన్న మరమ్మత్తులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని అన్నారు. టాయిలెట్స్ లకు సంబంధించి సూచిక బోర్డులు ప్రదర్శించాలని అన్నారు. పెయింటింగ్ కొరకు ఇంటీరియర్ కు రాయల్ ఏమర్సన్, ఎక్స్ టీరియర్ కి అపెక్స్ ఆల్టిమా పెయింట్ వాడాలన్నారు. పోలింగ్ కేంద్రంలో కావాల్సిన వెలుతురుకు లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రహరీ గోడపై ఓటర్లను అవగాహనపరిచే పెయింటింగ్ లు వేయాలని అన్నారు. క్రొత్తగా నిర్మిస్తున్న టాయిలెట్ బ్లాకుల మిగులు పనులు పూర్తి చేసి, వాడుకలో తేవాలన్నారు. ఒకే లొకేషన్ లో ఎక్కువ పోలింగ్ కేంద్రాలున్న చోట క్రౌడ్ మేనేజ్మెంట్ కి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. విద్యార్థులకు హామీ పత్రాల పంపిణీ గురించి అడిగి, తల్లిదండ్రుల సంతకం చేయించాలని, తల్లిదండ్రులకు, ఇంట్లో ఉన్న ఓటర్లకు నైతికతతో, డబ్బు, మద్యం, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని అవగాహన కల్పించాలన్నారు. ఓటును అమ్ముకోవద్దని, న్యాయబద్ధ ంగా ఓటు వేసేలా చైతన్యం తేవాల న్నారు. ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ గురించి బూత్ లెవల్ అధికా రిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్ర పరిధిలోని ప్రతి ఓటరుకు ఓటరు సమాచార స్లిప్పులు అందజే యాలని, ఓటరు స్లిప్పు తీసుకున్నట్లు రశీదు తీసుకోవాలని అన్నారు. వివిధ రాజకీయ పార్టీల వారితో మాట్లాడు తూ... సి విజిల్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని, ఎన్నికల అక్రమాలపై సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా పీఆర్ ఎస్ఇ చంద్రమౌళి, ఇఇ పాండు రంగ విఠల్, ఆర్ అండ్ బి ఇఇ శ్యామ్ ప్రసాద్, అధికారులు, తదితరులున్నారు.

# చైనా హెచ్9ఎన్2 వైరస్ వాళ్ళ భారత్‌కు ఎటువంటి రిస్క్ లేదు

**-స్పష్టం చేసిన భారత ప్రభుత్వం**

న్యూఢిల్లీ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: చైనాలో ప్రస్తుతం హెచ్9ఎన్2 వైరస్ కేసులు ప్రబలుతున్న నేపధ్యం లో శుక్రవారం భారత ప్రభుత్వం ప్రకటన చేసింది. చైనాలో ఉన్న హెచ్9ఎన్1 కేసులతో భారత్‌కు ఎటువంటి రిస్క్ లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏవియన్ ఇన్ఫ్లుయాంజా కేసులతో పాటు, శ్వాసకోస వ్యాధుల సంఖ్య చైనాలో పెరుగుతున్నాయి.

చిన్నారుల్లోనే ఈ లక్షణాలు అధికంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత సర్కారు ప్రకటన చేయాల్సి వచ్చింది. ఎటువంటి సమస్యనైనా ఎదుర్కొనేం దుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. పిల్లల్లో నమోదు అవుతున్న నుమోనియా కేసులకు కొత్త తరహా ప్యాథోజన్‌తో లింకు లేదని చైనా వెల్లడించినట్లు డబ్ల్యూహెచ్‌వో ఓ మీడియా సమావేశంలో పేర్కొన్నది. అక్టోబర్ నుంచి చైనా పిల్లల్లో శ్వాసకోశ వ్యాధులు నమోదు అవుతున్నట్లు డేటా ప్రకారం తెలుస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. అయితే వ్యాధులకు సంబంధించిన మరింత డేటాను ఇవ్వాలని చైనాను కోరినట్లు డబ్ల్యూహెచ్‌వో పేర్కొన్నది. బీజింగ్‌లో కానీ, లియానింగ్‌లో కానీ ఎటువంటి కొత్త ప్యాథోజెన్స్‌ను గుర్తించ లేదని, అయితే పిల్లల్లో నుమోనియా కేసులు పెరగడానికి సాధారణ ప్యాథోజెన్లే కారణమని డబ్ల్యూహెచ్‌వో చెప్పింది.

# పేదల పక్షాన నిలుస్తా.. సమస్యలను పరిష్కరిస్తా

**-స్వతంత్ర అభ్యర్థి రెడ్డిమల్ల పార్వతి**



హైదరాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్ ); పేదల పక్షాన నిలుస్తా.. సమస్యలను పరిష్కరిస్తానని ముషీరాబాద్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న రెడ్డిమల్ల పార్వతి అన్నారు. శుక్రవారం అంజమ్మ నగర్ లో పాద యాత్ర నిర్వహించారు. అనంతరం ఆమె విలేఖరులతొ మాట్లాడుతూ బి.జె.పి, బి.ఆర్.ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు నిరుపేదలకు ఏమీ చేయలేదని ముఖ్యంగా ముషిరాబాద్ నియోజకవర్గానికి అభివృద్ధి కుంటుపడిందని బి.ఆర్.ఎస్ ప్రభుత్వం ఇచ్చిన పథకాలను స్థానిక ఎం.ఎల్.ఎ వారి అనుచరులకు మాత్రమే ఇచ్చి అర్హులయిన వారికి ఇవ్వలేదని, దళిత బంధు, బి.సి. బంధు కూడా అసలయిన వారికి ఇవ్వకుండా స్థానికేతరులకు ఇచ్చారని కబాట్టి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇపుడయినా ప్రజలు మేల్కొని తనను అత్యధిక మెజారిటీతో గెలిపించలాని కోరారు.

# డబ్బు, మద్యం పంచకుండా గెలిచే దమ్ముందా..?

**- స్వతంత్రఅభ్యర్థి గుర్రంసత్యనారాయణ**



ఖమ్మం, నవంబర్ 24:(నేటి నిజం ప్రతినిధి): ఖమ్మం నియోజకవర్గ ప్రస్తుత ఎమ్మెల్యేకు, మాజీ ఎమ్మెల్యేకి డబ్బు, మద్యం పంచ కుండా గెలిచే దమ్ముందా అని స్వతం త్ర ఎమెమ్మెల్యే అభ్యర్థి గుర్రం సత్యనా రాయణ ప్రశ్నించారు. శుక్రవారం ఖమ్మం ఎన్నికల ప్రచారం ఘాటు వ్యా ఖ్యలతో సవాళ్లతో హీటెక్కి ంది. ప్రచా రంలో భాగంగా ఆయా గ్రామా లలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచా రం నిర్వహించారు. ఓడ గుర్తుపై ఓటు వేసి తనని గెలిపించండి. గెలిపించిన తర్వాత అర్హులైనటువంటి నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులం దరికీ ఉచిత విద్యను కల్పించేందుకు కృషి చేస్తాను పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించేలా నా వంతు ప్రయ త్నం చేస్తాను అని అన్నారు. నాకు కార్యకర్తల కు డబ్బులు లేవు మీరే నా కార్యకర్తలు కాబట్టి మీరు అందరూ నా బ్యాలెట్ నమూనా నెంబరు 21 “ఓడ” గుర్తుకి ఓటు వేసి గెలిపించండి అని విజ్ఞప్తి చేశారు.

# డ్రగ్స్‌కు కొనుగోలు కోసం తమ పిల్లలను అమ్ముకున్న దంపతులు

ముంబై నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);.: డ్రగ్స్‌కు బానిస అయిన దంపతులు వాటి కొనుగోలు కోసం తమ పిల్లలను అమ్ముకున్నారు. రెండేళ్ల కుమారుడితోపాటు నెల రోజుల కిందట జన్మించిన బిడ్డను విక్రయించారు. ఈ విషయం తెలిసిన కుటుంబ సభ్యురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. షబ్బీర్ ఖాన్, అతడి భార్య సానియా డ్రగ్స్‌కు అలవాటుపడ్డారు. డ్రగ్స్ కొనేందుకు తొలుత తమ రెండేళ్ల కుమారుడ్ని రూ.60,000కు అమ్ముకున్నారు. కాగా, నెల రోజుల కిందట పుట్టిన పసి పాపను కూడా ఆ దంపతులు అమ్మారు. డ్రగ్స్ కొనేందుకు షకీల్ మక్రానీ అనే వ్యక్తికి నవజాత శిశువును రూ.14,000కు విక్రయించారు. అయితే షబ్బీర్ ఖాన్ సోదరి రుబీనాకు ఈ విషయం తెలిసింది. ఆగ్రహించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరోవైపు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. షబ్బీర్ ఖాన్, అతడి భార్య సానియా ఖాన్‌తోపాటు పసి బిడ్డను కొనుగోలు చేసిన షకీల్ మక్రానీ, డ్రగ్స్ ఏజెంట్ ఉషా రాథోడ్‌ను అరెస్ట్ చేశారు. శుక్రవారం అంధేరీ ప్రాంతం నుంచి నెల రోజుల నవజాత శిశువును స్వాధీనం చేసుకున్నారు. రెండేళ్ల కుమారుడి ఆచూకీ, ఆ బాలుడ్ని కొన్న వారి కోసం ఆరా తీస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

# భారతీయ నేవీ అధికారుల మరణ శిక్ష పై భారత సర్కార్ సవాల్

**– పిటీషన్‌ను విచారణకు అంగీకరించిన ఖతార్ కోర్టు**

న్యూఢిల్లీ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );;: భారతీయ నేవీకి చెందిన 8 మందికి ఖతార్ కోర్టు మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. ఆ శిక్షను సవాల్ చేస్తూ భారత సర్కార్ దాఖలు చేసిన పిటీషన్‌ను ఖతార్ కోర్టు విచారణకు అంగీకరించింది. అయితే త్వరలోనే ఆ కేసు విచారణ తేదీని కోర్టు ప్రకటించనున్నది. గూఢచర్యం కింద ఖతార్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ఆగస్టు 2022లో 8 మందిని అరెస్టు చేసింది. కానీ ఖతార్ ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు ఎటువంటి ఆరోపణలు చేయలేదు. అనేక సార్లు బెయిల్ పిటీషన్‌ను పెట్టుకున్నా.. ఖతార్ సర్కార్ వాటిని తిరస్కరించింది. అరెస్టు అయినవారిలో కమాండర్ పూర్ణేందు తివారి, కమాండర్ సుగుణాకర్ పాకాల, కమాండర్ అమిత్ నాగ్‌పాల్, కమాండర్ సంజీవ్ గుప్తా, కెప్టెన్ నవతేజ్ సింగ్ గిల్, కెప్టెన్ బీరేంద్ర కుమార్ వర్మ, కెప్టెన్ సురభ్ వాసిత్, సెయిలర్ రాగేశ్ గోపాకుమార్ ఉన్నారు. అరెస్టు అయిన నేవీ ఆఫీసర్లు అందరూ దాదాపు 20 ఏళ్ల పాటు సర్వీస్‌లో ఉన్నారు.

# బీసీ ముఖ్యమంత్రి అన్న బిజెపికి అండగా ఉందాం..

**-మల్కాజ్గిరిలో బిజెపిని గెలిపిద్దాం**

**-బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజేష్ పటేల్**

మల్కాజిగిరి నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);బీసీ ముఖ్యమంత్రి అన్న బిజెపికి అండగా ఉందాం..



మల్కాజ్గిరిలో బిజెపిని గెలిపిద్దా మని బీసీ విద్యార్థి యువజన మహిళా సంఘం నాయకులకు తీర్మానం చేసారు. శుక్రవారం మల్కాజ్గిరి లో విద్యార్థి యువజన మహిళా సంఘలు సమావేశామైనాయి. ఈ సందర్బంగా బీసీ ముఖ్యమంత్రి అన్న బిజెపికి అండగా ఉందాం.. మల్కాజ్గిరి నియోజకవర్గంలో బిజెపి అబ్యర్తి రామచంద్ర రావును అత్యధిక మేజారితి తో గెలిపిద్దామని తీర్మానించారు. ఈ సందర్బంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజేష్ పటేల్ మాట్లాడుతూ 75 సంవత్సరాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణల రాష్ట్రంలో ఒక్కసారి కూడా బీసీ ముఖ్యమంత్రి కాలేదని కానీ బిజెపి అధికారంలోకి వస్తే ఒక బీసీనే ముఖ్యమంత్రి చేస్తా అన్న ప్రధాన మంత్రికి సమావేశం ధన్యవాదాలు తెలియజేసింది. మల్కాజ్గిరి నియోజకవర్గంలో రామచంద్ర రావు గారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎవత్ బీసీ సమాజానికి విజ్ఞప్తి చేస్తు న్నట్టు సాయి పటేల్ తెలిపారు. కేంద్రంలో 27 మందికి బీసీలకు మంత్రిత్వ శాఖ కేటాయించిన పార్టీ, ఒక గిరిజన మహిళకు రాష్ట్రపతి చేసిన పార్టీ, ఒక బీసీని ప్రధాని చేసిన పార్టీ బిజెపి కాబట్టి వారికి అండగా ఉండి బిసి ముఖ్యమంత్రి ని చేసే సత్తా ఉన్న పార్టీ బిజెపి అని నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. బీ ఆర్ ఎస్ పార్టీ బీసీలను మోసం చేసిందని కనీసం మేనిఫెస్టోలో కూడా బీసీల సమస్యలను పెట్టలేదని అలాంటి పార్టీలకు బీసీలు బుద్ధి చెప్పాలని కోరారు. ఈకార్యక్రమంలో గౌతమ్ ప్రజావతి, నిర్మల యాదవ్, శశికల, అశ్విన్, మనోజు ముదిరాజ్, శివ యాదవ్, సాయి పటేల్, అర్జున్, లక్ష్మి, ప్రమీల, భాస్కర్, శ్రీధర్ మరియు నాయకులు పాల్గొన్నారు.

# బాగ్అంబర్ పేటలో కాలేరు ప్రచార జోరు

అంబర్ పేట నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);అంబర్ పేట బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ప్రత్యర్థులు కాంగ్రెస్ బిజెపి పార్టీలకు అందనంత దూరంలో ఆయన ప్రచార వేగం కొనసాగుతోంది.

ఈ సందర్భంగా పలు బస్తీలలో ఆయన గడపగడపకు తిరిగి ప్రజలతో నేరుగా మాట్లాడుతున్నారు సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజల భవితను బంగారం లాగా మారుస్తున్నారని, , మరెవ్వరికీ సాధ్యం కాని రీతిలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఆయనకే మూడవ సారి పట్టం కట్టాలని కోరారు. ఆయన వెంట కార్పొరేటర్ శ్రీమతి పద్మా వెంకటరెడ్డి, శ్రీమతి డి పి రెడ్డి పద్మావతి రెడ్డి గార్లతో కలిసి బాగ్ అంబర్ పేటలోని బతుకమ్మకుంట వీకర్ సెక్షన్, చెంచు బస్తీ, శాంతి నగర్, జామ్ జామ్ మసీదు ప్రాంతాల్లో అడుగడుగునా ప్రజల ఉత్సాహాల మధ్య ఎన్నికల ప్రచార పాద యాత్రను నిర్వహించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సమక్షంలో 500 మంది బీఆర్ఎస్ లో చేరికఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సమక్షంలో, కార్పొరేటర్ శ్రీమతి పద్మా వెంకటరెడ్డి మరియు సీనియర్ నాయకులు శ్రీ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో, శ్రీ దిలీప్ రాజ్ నాయకత్వంలో500 మంది అంబర్ పేట బీఆర్ఎస్ లో చేరారు. కాలేరు వెంకటేష్ వారిని పార్టీ కండువా కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు.

కేసీఆర్ పాలనలో తెలంగాణ ప్రజల అభివృద్ధి బాగా జరగడం అలాగే అంబర్ పేట లో కాలేరు వెంకటేష్ నాయకత్వంలో అద్భుతమైన సంక్షేమం లభించడం చూసి ఆకర్షితులమై బీఆర్ఎస్ లో చేరినట్లు వారు తెలియచేశారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మనోహర్ రెడ్డి సోదరుడి ఇంటిపై ఐటీ దాడులు

వికారాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ వికారాబాద్ జిల్లా తాండూరులో ఐటీ దాడులు కలకలం సృష్టించాయి. యలాల మండలం జుక్కపల్లి సమీపంలోని ఆర్‌బీఎల్ ఫ్యాక్టరీలో సోదాలు నిర్వహిస్తున్నారు. అది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మనోహర్ రెడ్డి సోదరుడు శ్రీనివాస్ రెడ్డికి చెందినది కావడం విశేషం. ఫ్యాక్టరీతోపాటు ఆయన నివాసంలోనూ తనిఖీలు చేస్తున్నారు. ఇటీవల చెన్నూరు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ నివాసంతోపాటు కార్యాలయాల్లోనూ ఐటీ, ఈడీ అధికారులు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. వివేక్‌కు చెందిన కంపెనీ అకౌంట్‌లోని డబ్బు పెద్దమొత్తంలో ఓ సెక్యూరిటీ ఏజెన్సీ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అవడం, ఈడీ సూచనమేరకు బ్యాంకు అధికారులు ఆ మొత్తాన్ని సీజ్ చేశారు. అంతకుముందు హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో రూ.50 లక్షలు పట్టుబడ్డాయి.

# కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ఇంటి ఇంటి ప్రచారాన్ని ముమ్మరం చేసిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం



ఖమ్మం, నవంబర్ 24:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె.వి.క్రిష్ణారావు ఆధ్వర్యంలో మమత హాస్పిటల్ హార్వెస్ట్ స్కూల్ ఏరియాలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం గడప గడపకు తిరిగి కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల కరపత్రం పంచుతూ రాబోవు అసెంబ్లీ ఎన్నికలలో హస్తము గుర్తు పైన ఓటు వేసి ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావుని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉద్యమకారుల ఫోరం ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పేదవాళ్లకు ఇంటి స్థలం, ఇల్లు కట్టుకోవడం కోసం 5లక్షలు రూపాయలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యమకారుల ఫోరమ్ కన్వీనర్ బచ్చల పద్మాచారి, కామ ప్రభాకర్, బోడ వీరన్న, భూక్యా శ్రీనివాస్ నాయక్, బట్టు రాజేందర్ నాయక్, షేక్ మస్తాన్, బాసాటీ హనుమంతరావు, దొడ్డ శ్రీనివాస్ రెడ్డి, నరసింహరావు, ప్రణయ్, సాయి, గోపి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే విజయ తీరాలకు చేరుస్తాయి

**-కాంగ్రెస్ మేనిఫెస్టో బిజెపి బిఆర్ఎస్ లకు ఉక్కిరిబిక్కిరి**

**- రామగుండంలో రాజ్ ఠాకూర్ ను గెలిపించండి**

**- మాజీ మంత్రి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపు**

రామగుండం నవంబర్ 24(ఎక్స్ ప్రెస్ న్యూ స్); పదేండ్ల టిఆర్ఎస్ పాలన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా



దోచుకున్నారని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిన లక్ష్యం ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని మాజీ మంత్రి, మంథని శాసనసభ్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 8ఇంక్లైన్ కాలనిలో బుధవారం సాయంత్రం జరిగిన సిపిఐ ఎ.ఐ.టి.యు.సి జనరల్ బాడీ మీటింగ్ లో మంథని శాసన సభ్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు రామగుండం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోతో బిజెపి బీఆర్ఎన్ పార్టీలకు దిమ్మతిరిగిపోతుందని ప్రజల నిండి వస్తున్నాను ప్రియమైన స్పందనకు రెండు పార్టీలు కంగు తింటున్నాయని అన్నారు రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ... బిఆర్ఎస్ పార్టీ దోపిడి పాలన చేస్తుందని, మాయ మాటలతో ప్రజలను మోసం చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు

# బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీ : బీఎస్పీ పార్టీ ఛీఫ్ మాయావతి

పెద్దపల్లి నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీ అని బహుజన్ సమాజ్ పార్టీ ఛీఫ్ మాయావతి వ్యాఖ్యానించారు. గురువారం నాడు పెద్దపల్లి జిల్లాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఎస్పీ తెలంగాణ ముఖ్యమంత్రి అభ్యర్థి ప్రవీణ్ కుమార్ ని తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాయవతి మీడియాతో మాట్లాడుతూ...“అన్ని సామాజిక వర్గాల వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చిన ఏకైక పార్టీ బీఎస్పీ మాత్రమే. ఖీ ప్రవీణ్ కుమార్‌పై ఎఫ్ఐఆర్‌లను బీఆర్ఎస్ పార్టీ నమోదు చేసింది. ఉత్తర ప్రదేశ్‌లో బీఎస్పీ అధికారంలో ఉన్నపుడు భూమిలేని నిరుపేదలకు భూమి పంపిణీ చేశాము. తెలంగాణ రాష్ట్రంలో కూడా బీఎస్పీ అధికారంలోకి వచ్చిన తర్వాత భూమి పంపిణీ చేస్తాం. అన్నివర్గాలకు న్యాయం జరగాలంటే బీఎస్పీ అధికారంలోకి రావాలి. 30వ తేదీన జరిగే ఎన్నికల్లో ఏనుగు గుర్తుపై ఓటు వేసి బీఎస్పీని గెలిపించాలి” అని మాయావతి పిలుపునిచ్చారు.

# ఎన్టీపీసీలో షరతులు లేకుండా వారసత్వ ఉద్యోగాలు

**-రామగుండం నియోజకవర్గ బిజెపి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల సంధ్యారాణి...**

రామగుండం నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఎన్టీపీసీలో షరతులు లేకుండా వారసత్వ ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తానని బిజెపి పార్టీ రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల సంధ్యారాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీలోని ఓ ప్రైవేట్ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిజెపి నేషనల్ కౌన్సిల్ మెంబర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి తో కలసి సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం సంధ్యారాణి మాట్లాడుతూ... గెలిచిన 5 ఏళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ఎంతో కష్టపడి బీఆర్ఎస్ పార్టీలో పనిచేస్తే కనీసం తనను పార్టీ కార్యక్రమాలకు కూడా పిలవకుండా అవమానాలకు గురి చేశారని ఆరోపించారు. అలాగే స్థానిక నాయకులు ఎంతకు అమ్ముడు పోతారని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిస్తూ నన్ను మానసికంగా ఇబ్బందులకు గురి చేశారని కన్నీటి పర్యంతమయ్యారు. నా కుటుంబానికి పిల్లలకు దూరంగా ఉంటూ ప్రజా సమస్యల కోసం పోరాటం చేస్తుంటే కించపరిచే విధంగా మాట్లాడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రామగుండం నియోజకవర్గం లో బిజెపి అభ్యర్థిగా తనను గెలిపిస్తే గెలిచిన నెల రోజుల్లో ఈఎస్ఐ హాస్పిటల్ ను తీసుకువచ్చి భూమి పూజ చేస్తానని హామీ ఇచ్చారు. అంతే కాకుండా ఎన్టీపీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పిల్లలకు పర్మినెంట్ కార్మికుల పిల్లలతో సమానంగా ప్రైవేట్ పాఠశాలల్లో 50% ఫీజులో రాయితీ ఇవ్వడంతో పాటు సొంత ఇల్లు లేని వారికి క్వాటర్ ఇప్పించే విధంగా యాజమాన్యంతో మాట్లాడి ఒప్పిస్తానని తెలిపారు. సమాజానికి మంచి చేయాలనేదే నా తపన అని అన్నారు. కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు నా ప్రచార వాహనాలపై దాడి చేసి ధ్వంసం చేస్తున్నారని నేను ప్రచారానికి వెళ్లిన సమయంలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని సంధ్యారాణి ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుడి బిడ్డగా ఆదరించి ఒక అవకాశం కల్పిస్తే నియోజకవర్గంను అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు. రామగుండం నియోజకవర్గం నుండి భారతీయ జనతా పార్టీ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేరుగు హనుమంత్ గౌడ్. పెద్దపల్లి రవీందర్. మహవాది రామన్న. జక్కుల నరహరి. ముక్కురి రాజు. రామ్ సింగ్. ఎమ్మార్పీఎస్ సంఘాల నాయకులతో పాటు. తదితరులు పాల్గొన్నారు

# మధురవాడలో గ్యాస్ లీక్.. నలుగురికి తీవ్రగాయాలు

అమరావతి, నవంబర్ 24:మధురవాడ వాంబే కాలనీలో గ్యాస్ లీక్ అవ్వడంతో నలుగురికి తీవ్రగాయాలైన ఘటన పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇవాళ తెల్లవారుజామున ఒక్కసారిగా గ్యాస్ లీక్ అయ్యింది. గ్యాస్ లీక్ అవుతుందని రెగ్యులేటర్ ఆఫ్ చేసినా అదుపులోకి రాలేదు. గ్యాస్ లీకేజీని అదుపులోకి తేవడానికి ప్రయత్నించగా.. ఒక్కసారిగా మంటలు రావడంతో ఇంట్లో ఉన్న నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఫైర్ సిబ్బందికి సమచారం ఇవ్వడంతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో యామల బాలరాజు, యామల చిన్ని, యామల గిరి, యామల కార్తీక్ అనే నలుగురు గాయపడ్డారు. గాయాలపాలైన వారిని 108 లో కేజీహెచ్ కు తరలించారు.

